ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

మంగళవారం | 17-03- 2026 | సంపుటి: 16, | సంచిక: 342 | పేజీలు: 12, | వెల: 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

# క్యూర్.. ఫ్యూర్.. రేర్..

## - బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రసంగం

### తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో
### అభివృద్ధి దిశగా అడుగులు

- 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు
- వ్యవసాయం, సంక్షేమం, మౌలిక వసతులకు ప్రాధాన్యం
- హైదరాబాద్ పునర్వ్యవస్థీకరణ, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ప్రస్తావన
- మహిళలు, రైతులు, పేదల సంక్షేమానికి అనేక పథకాలు
- పెట్టుబడులు, ఉద్యోగాలు, విద్యా-వైద్య రంగాల్లో పురోగతి



**హైదరాబాద్, మార్చి 16 (ప్రజాకలం) :** తెలంగాణ సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ అభివృద్ధి లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐకమత్యంతో ముందుకు సాగుతోందని గౌరవ రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన గవర్నర్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ లక్ష్యాలను సభ ముందు వివరించారు. ప్రపంచంలో గుర్తింపు పొందిన రాష్ట్రంగా తెలంగాణను

తరువాయి 2వ పేజీలో...





## 30 వరకు అసెంబ్లీ
# సమావేశాలు!

- మధ్యలో నాలుగు రోజులు సెలవులు..
- 20న బడ్జెట్.. నేడు, రేపు గవర్నర్ ప్రసంగంపై చర్చ
- చర్చకు 18న ముఖ్యమంత్రి సమాధానం
- బీఏసీ సమావేశంలో నిర్ణయం!
- 20 రోజులు నిర్వహించాలన్న విపక్షాలు

హైదరాబాద్, మార్చి 16: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సోమవారం బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బీఆర్ఎస్ ఎమ్మెల్యే

తరువాయి 2వ పేజీలో...

# ఆస్తి పన్ను రాయితీ




- జీహెచ్ఎంసీ వాసులకు భారీ ఊరట
- ఆస్తి పన్ను వడ్డీలో 90 శాతం డిస్కౌంట్
- వన్ టైమ్ సెటిల్మెంట్ పథకాన్ని అమలు చేస్తున్న జీహెచ్ఎంసీ
- ప్రిన్సిపల్ టాక్స్‌తో పాటు 10% వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది
- ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాల్లో చెల్లింపుల సౌకర్యం
- ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ సూచన

2లో

# 'క్యూర్'లో ఇందిరమ్మ ఇళ్లు!

## నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయండి : మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, మార్చి 16 (ప్రజాకలం) :** కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని, హైదరాబాద్ నగరంలో నివసించే పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. సీఎం రేవంత్ ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దానికి తగ్గట్టుగా అధికారులు పనిచేయాలని చెప్పారు. సోమవారం ఆయన మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై సమీక్షించారు. క్యూర్ పరిధిలో మంజూరు చేయబోయే ఇళ్లకు, అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేయాలని, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గవద్దని స్పష్టంచేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పొంది, వాటిని అద్దెకు ఇస్తున్నవారికి,


తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




# సేఫ్‌గా భారత నౌక

## ఉద్రిక్తతల మధ్య సురక్షితంగా బయటపడిన భారత గ్యాస్ నౌక



- గుజరాత్ ముంద్రా పోర్టుకు చేరనున్న 'శివాలిక్'
- సుమారు 40 వేల టన్నుల ఎల్పిజీ తో ప్రయాణం
- గల్ఫ్ పరిస్థితుల మధ్య దేశానికి ఊరట
- మరో నౌక 'నందాదేవి' కూడా భారత్ వైపు
- అప్రమత్తంగా నౌకలను పర్యవేక్షిస్తున్న భారత నౌకాదళం

**హైదరాబాద్, మార్చి 16 (ప్రజాకలం) :** గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య హోర్ముజ్ జలసంధి నుంచి మరో భారత నౌక సురక్షితంగా బయటపడింది. భారత జెండాతో నడిచే ఎల్పిజీ గ్యాస్ ట్యాంకర్ 'శివాలిక్' హోర్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటి భారత్ వైపు ప్రయాణించి గుజరాత్‌లోని ముంద్రా ఓడరేవుకు చేరుకునే దశలో ఉంది. ఈ నౌక సోమవారం సాయంత్రానికి ముంద్రా పోర్టుకు చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ ఉద్రిక్తతల కారణంగా హోర్ముజ్ మార్గంలో నౌకాయానంపై తీవ్ర ప్రభావం పడింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన ఈ జలసంధిలో అనేక దేశాల నౌకలు జాగ్రత్తగా ప్రయాణిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారత నౌక సురక్షితంగా బయటపడటం దేశానికి పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది.

తరువాయి 2వ పేజీలో...

# వడగండ్ల వాన హెచ్చరిక

- కొన్ని జిల్లాల్లో వడగండ్ల వానకు అవకాశం
- పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్
- గంటకు 40-60 కిమీ వేగంతో ఈదురు గాలులు
- రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఎండల తీవ్రత మధ్య తాత్కాలిక ఉపశమనం

## తెలంగాణలో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు



**హైదరాబాద్, మార్చి 16 (ప్రజాకలం) :** తెలంగాణలో వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారుతున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కూడా పడే అవకాశం ఉన్నందున పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వర్షాలు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన

తరువాయి 2వ పేజీలో...

# క్యూర్.. ప్యూర్.. రేర్..

మొదటి పేజీ తరువాయి...

తీర్చిదిద్దాలన్న సంకల్పంతో "తెలంగాణ రైజింగ్-2047" విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో వివిధ రంగాల్లో సంస్కరణలు చేపడుతున్నామని చెప్పారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, రైతు సంక్షేమ పథకాల అమలు, సాగునీటి వసతుల మెరుగుదల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.పట్టణాభివృద్ధిలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పునర్వ్యవస్థీకరించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించామని పేర్కొన్నారు. కోర్ అర్బన్ ప్రాంతంలో సరస్సులు, చెరువులను పునరుద్ధరించడంతో పాటు హైడ్రా ద్వారా భారీ స్థాయిలో ఆక్రమణలను తొలగించామని తెలిపారు. ఆధునిక నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు మూసీ రివర్ ఫ్రంట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టును కూడా చేపట్టామని వివరించారు. పెట్టుబడుల పరంగా తెలంగాణ కీలక గమ్యస్థానంగా నిలుస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, బయో ఏషియా సమ్మిట్‌ల ద్వారా సుమారు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని చెప్పారు. అలాగే మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా రేడియల్ రోడ్లు, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలు, హైస్పీడ్ రైలు మార్గాల అభివృద్ధి వంటి ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతుల సంక్షేమం కోసం రూ.20,616 కోట్ల పంట రుణమాఫీ, సన్నరకం ధాన్యానికి బోనస్, రైతు భరోసా వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల సాధికారత కోసం ఉచిత బస్సు ప్రయాణం, మహాలక్ష్మి పథకం కింద రూ.500కు ఎల్పీజీ సిలిండర్, గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. విద్యా రంగంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు వంటి చర్యలు చేపట్టగా, వైద్య రంగంలో వరంగల్ హెల్త్ సిటీ, నూతన ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సామాజిక న్యాయం లక్ష్యంగా కుల సర్వే నిర్వహించి ఎస్సీ కులాల వర్గీకరణ పూర్తి చేసినట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత కోసం పీఎస్సీ పునరుద్ధరణతో పాటు రికార్డు సమయంలో వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎవ్వరూ అడ్డుకోలేరని గవర్నర్ స్పష్టం చేశారు.

# 30 వరకు అసెంబ్లీ సమావేశాలు!

మొదటి పేజీ తరువాయి...

ఏళ్ల తరబడి తాళాలు వేసి ఖాళీగా ఉంచుతున్న వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి, అర్హులైన పేదలకు కేటాయించాలని చెప్పారు. ఆయా పథకాల్లో ఇళ్లు పొంది, నివాసం ఉండని ఇళ్లను మే 1 నుంచి పరిశీలించి, నోటీసులు ఇవ్వాలని, స్పందించకపోతే కేటాయింపులను రద్దు చేయాలని తెలిపారు. నోటీసులకు స్పందించిన వారి దగ్గరి నుంచి తాము ప్రభుత్వం కేటాయించిన ఇంట్లోనే నివాసం ఉంటామని.. లేదంటే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి అప్పగిస్తూ వారి నుంచి బాండు పేపరు మీద హామీ పొందాలని, ప్రభుత్వ నిబంధనలకు ఆమోదం తెలిపేలా 'అండర్‌టేకింగ్' కూడా తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. 4 జిల్లాల పరిధిలో ఉన్న కాలనీల్లో విద్యుత్తు, తాగునీరు, డ్రైనేజీ వంటి వసతులను తప్పనిసరిగా కల్పించాలని, ఈ విషయంలో జీహెచ్‌ఎంసీ సహకారం తీసుకోవాలని చెప్పారు. 22 వేల ఇళ్లకు కరెంటు మీటర్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ టవర్ల నిర్మాణం పూర్తయ్యేవరకు ఆగకుండా పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు కేటాయించాలన్నారు. వివిధ కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను వేలం పద్ధతిలో విక్రయించాలని, వాటి ద్వారా వచ్చిన డబ్బును అక్కడి సొసైటీ/ప్రభుత్వం పేరిట సంయుక్త ఖాతాను తెరిచి, అందులో జమ చేయాలని సూచించారు.

# 'క్యూర్'లో ఇందిరమ్మ ఇళ్లు!

మొదటి పేజీ తరువాయి...

హరీశ్‌రావు, బీజేపీ సభ్యుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం సభ్యుడు కౌసర్ మొహిద్దీన్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాలను కనీసం 20 రోజులపాటు నిర్వహించాలని విపక్ష సభ్యులు కోరారు. అయితే, ఈ నెల 30వ తేదీతో సమావేశాలను ముగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. 16వ తేదీన సమావేశాలు మొదలవగా.. 30 వరకు అంటే 14 రోజుల వ్యవధి ఉంటుంది. ఇందులో రెండు ఆదివారాలు, రెండు పండుగ సెలవులు ఉన్నాయి. 17న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ఉంటుంది. 18న ఈ చర్చకు సీఎం రేవంత్ రెడ్డి సమాధాన మిస్తారు. 19న ఉగాది పర్వదినం. 20న రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. 21న రంజాన్, 22న ఆదివారం సెలవు ఉంటాయి. 23 నుంచి బడ్జెట్ పద్దులపై చర్చ ఉంటుంది. కోర్ అర్బన్ విలీన బిల్లు, మూసీ, గిగ్ వర్కర్ల బిల్లులపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. 30న ద్రవ్య వినిమయ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించనున్నారు.

**పనిదినాలు పెంచాలి: విపక్షాలు**


అసెంబ్లీ పని దినాలు పెంచాలని కోరినట్లు బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. బీఏసీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 30 వరకే అసెంబ్లీని నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతోందని, అందులో రెండు ఆదివారాలు, పండగలు పోతే ఎన్ని రోజులు నడుపుతారని ప్రశ్నించారు. ఆదివారాల్లో కూడా సభను నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. మంగళవారం నాటి సమావేశాల షెడ్యూల్‌లో ప్రశ్నోత్తరాల సమయం లేకపోవడంపై ప్రశ్నించినట్లు చెప్పారు. 19 అంశాలపై చర్చ చేపట్టాలని కోరినట్లు వెల్లడించారు. సమావేశాలను ఏప్రిల్ 20 వరకు కొనసాగించాలని బీజేపీ తరఫున కోరినట్లు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. బీజేపీ తరఫున 21 అంశాలను చర్చకు ప్రతిపాదించినట్లు చెప్పారు. 20 రోజులైనా సమావేశాలను నిర్వహించాలని సీపీఎం నేత కూనంనేని సాంబశివరావు తెలిపారు. గరిష్ఠంగా 8 రోజులు కూడా సమావేశాలు జరిగే అవకాశం లేదని అన్నారు.

# వడగండ్ల వాన హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి...

వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కూడా కురిసే అవకాశముందని హెచ్చరించారు. అదేవిధంగా గంటకు సుమారు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని వాతావరణ నిపుణులు తెలిపారు. దీంతో చెట్ల కింద నిలబడకుండా, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువసేపు ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రైతులు కూడా పంటలను రక్షించుకునే చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే వర్షాలు ఎండల తీవ్రతను కొంతవరకు తగ్గించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అయితే వడగండ్ల వాన కారణంగా పంటలకు నష్టం కలిగే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మార్చి మధ్య వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ వర్షాల ప్రభావం కొనసాగవచ్చని, పరిస్థితులను వాతావరణ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# సేఫ్‌గా భారత నౌక



మొదటి పేజీ తరువాయి...

'శివాలిక్' నౌకలో సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల ద్రవీభవించిన పెట్రోలియం గ్యాస్ ఉన్నట్లు సమాచారం. ఈ గ్యాస్ దేశంలో గృహ వినియోగానికి కీలకమైనది. దీంతో ఈ నౌక సురక్షితంగా భారత్‌కు చేరుకోవడం ఇంధన సరఫరా పరంగా కూడా కీలకంగా భావిస్తున్నారు.

ఇదే సమయంలో మరో భారత నౌక 'నందాదేవి' కూడా హార్మూజ్ జలసంధిని దాటి భారత్ వైపు ప్రయాణిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో భారత నౌకాదళం అప్రమత్తంగా నౌకలను పర్యవేక్షిస్తూ అవసరమైన రక్షణ చర్యలు చేపడుతోంది.

హార్మూజ్ మార్గం నుంచి భారత నౌకలు సురక్షితంగా బయటపడటం దేశ ఇంధన భద్రతకు అనుకూలమైన పరిణామంగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసు:

# రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు..

హైదరాబాద్, మార్చి 16 : రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ ప్రాంతంలో జరిగిన ఫామ్‌హౌస్ డ్రగ్స్ పార్టీ కేసు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. ఈ కేసులో జరిగిన పరిణామాలు, డ్రగ్స్ వినియోగం, రక్త పరీక్షల ఫలితాలు, పార్టీలో పాల్గొన్నవారి వివరాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. ఈ కేసుకు సంబంధించిన పోలీసుల రిమాండ్ రిపోర్టులో పలు కీలక అంశాలు బయటపడ్డాయి. ముఖ్యంగా స్విమ్మింగ్ పూల్ దగ్గర డ్రగ్స్‌తో పాటు మద్యం పార్టీ జరిగినట్లు పోలీసులు తమ రిపోర్టులో పేర్కొన్నారు. పార్టీలో పాల్గొన్నవారు లిక్కర్‌తో పాటు డ్రగ్స్ తీసుకున్నట్లు విచారణలో ఒప్పుకున్నారని చెప్పారు.



**డ్రగ్స్ పార్టీకి ముందుగానే ప్లాన్..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫామ్‌హౌస్‌లో జరిగిన ఈ పార్టీ ముందుగానే ప్లాన్ చేసినట్లు తెలిపారు. పార్టీలో ఉన్నవాళ్లు లిక్కర్‌తో పాటు డ్రగ్స్ తీసుకున్నట్లు ఒప్పుకున్నారని అన్నారు. మరోసారి ఎర్రగడ్డ ఆస్పత్రిలో అందరికీ రక్తనమూనాలతో పరీక్షలు నిర్వహించామని చెప్పారు. రెండోసారి పరీక్షలు చేసిన సమయంలో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌కి డ్రగ్స్ పాజిటివ్ వచ్చిందని అన్నారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడిందని చెప్పారు. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డిలు కొకైన్ తీసుకున్నట్లుగా రిపోర్టులో వచ్చిందని వెల్లడించారు. ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో మొత్తం ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలిందని పోలీసులు పేర్కొన్నారు.

నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవిలకు డ్రగ్స్ పాజిటివ్ వచ్చిందని పోలీసులు వివరించారు. ఈ పార్టీలో మద్యం, కొకైన్ కలుపుకొని తాగారని అన్నారు. పైలట్ రోహిత్ రెడ్డినే వీరందరికి వీకెండ్ డ్రగ్స్ పార్టీ ఏర్పాటు చేశారని తెలిపారు. ఇంకా రిమాండ్ రిపోర్టులో పోలీసులు పలు అంశాలను ప్రస్తావించారు.

**మేము వారించినా కాల్పులు జరిపారు: పోలీసులు**

ఫామ్‌హౌస్‌లోకి వెళ్లగానే మొదటగా తుపాకీ శబ్దాలు వినపడ్డాయని పోలీసులు తెలిపారు. 'తుపాకీ కాల్పుల శబ్దాలు విని వెంటనే మేమంతా అప్రమత్తమయ్యాం. కాల్పులు జరపొద్దని, ఎలాంటి చర్యలు తీసుకోమని మేము గట్టిగా చెప్పాం. మేము చెప్పినప్పటికీ కూడా మరో రెండు సార్లు తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించాయి. మరోవైపు మీరు కాల్పులు జరపండి.. నేను మొత్తం చూసుకుంటాను.. ఏం జరిగినా నాదే బాధ్యత అంటూ ఫాంహౌస్ నుంచి మాకు గట్టిగా వినపడింది. మేమంతా గట్టిగా వారించేసరికి ఒక్కసారిగా తుపాకీ కాల్పుల శబ్దాలు నిలిచిపోయాయి. మేమంతా ఒక్కసారిగా స్విమ్మింగ్ పూల్ వద్దకు చేరుకున్నాం. ఫామ్‌హౌస్‌లో రైడ్స్ చేసేందుకు అప్పటికే మేము వారెంట్ తీసుకున్నాం. ఫామ్‌హౌస్‌లోకి ప్రవేశించగానే వెంటనే సెర్చ్ వారెంట్లను రోహిత్ రెడ్డికి ఇచ్చాం. బాత్ రూం దగ్గర ఉన్న నమిత్ శర్మ చేతిలో తుపాకీని మేము స్వాధీనం చేసుకున్నాం. బుల్లెట్ షెల్స్ పట్టుకొని మరొకరు ఉన్నారని, అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నాం. ఫామ్‌హౌస్‌లో ఓ మహిళతో పాటు పదిమందిని అదుపులోకి తీసుకున్నాం. జర్మనీకి చెందిన రివాల్వర్ - 32ని స్వాధీనం చేసుకున్నాం. 11 మందిని వేర్వేరుగా విచారించాం. ఎవరు కూడా డ్రగ్స్ తీసుకోలేదని చెప్పి బుకాయించే ప్రయత్నం చేశారు. అందరిని పదేపదే విచారించడంతో సిల్వర్ శరత్ కుమార్ డ్రగ్స్ తీసుకున్నట్లుగా ఒప్పుకున్నారు. అతన్ని పరిశీలించినప్పుడు రెండు గ్రాముల కొకైన్ బయటపడింది' అని పోలీసులు వెల్లడించారు.

**సిమ్లా నుంచి డ్రగ్స్..**

కొకైన్ ఎవరు తెచ్చారనే విషయాన్ని వారిని ముందుగా అడిగితే చెప్పలేదని పోలీసులు తెలిపారు. పైలట్ రోహిత్ రెడ్డి డ్రైవర్‌ను విచారించినప్పుడు కొకైన్ ఎవరు తెచ్చారనే విషయం బయటపడిందని అన్నారు. 'ఈ డ్రగ్స్ కోసం కొంత డబ్బును కొందరికి ఇచ్చినట్లు డ్రైవర్ ఒప్పుకున్నారు. కొకైన్ తానే తెచ్చానని కౌశిక్ ఒప్పుకున్నారు. సిమ్లా బిజినెస్ ట్రిప్‌నకు వెళ్లినప్పుడు తాను కొకైన్ తీసుకువచ్చానని చెప్పారు. సిమ్లాలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఈ డ్రగ్స్ కొన్నట్లుగా తెలిపారు. డ్రగ్స్ పార్టీ కోసమే కొకైన్‌ను తీసుకువచ్చినట్లు కౌశిక్ చెప్పారు.

డ్రగ్స్ ఒక్కొక్క గ్రామ్‌కి రూ.15000లు చెల్లించి కొనుగోలు చేసినట్లు కౌశిక్ చెప్పారు. 11 మందికి డ్రగ్ లైవ్ కిట్స్ ద్వారా టెస్టులు చేశాం. అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి, రితేశ్‌రెడ్డి, నమిత్ శర్మ, రోహిత్‌రెడ్డిలకు డ్రగ్స్ పాజిటివ్‌గా వచ్చింది. కాల్పులు జరిపిన నమిత్ శర్మని అరెస్ట్ చేశాం. ఈ కాల్పులు జరిపిన తుపాకీని పైలట్ రోహిత్ రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డికి చెందినదిగా గుర్తించాం.

# రైతుల సమస్యలు పట్టించుకోరా..

## - కాంగ్రెస్ సర్కార్‌పై జీవన్‌రెడ్డి ఫైర్

జగిత్యాల, మార్చి 16 : అన్నదాతల సమస్యలను పట్టించుకోవడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న పంట కొనుగోళ్లలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆగ్రహించారు. రైతుల పంటకు తగిన ధర దక్కకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మొక్కజొన్నను మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**రైతులతో కలిసి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ..**

జగిత్యాల పట్టణంలో రైతులు సోమవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి జీవన్‌రెడ్డి నాయకత్వం వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మొక్కజొన్న రైతులు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలపడానికి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. రైతుల చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ తమ ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాలీ అనంతరం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. మొక్కజొన్న పంటకు తగిన ధర ఇవ్వాలని, వెంటనే ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

**కొనుగోళ్లలో జాప్యం చేస్తున్న ప్రభుత్వం..**

మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతులు పంట పండించి మార్కెట్‌కు తీసుకువస్తే ప్రభుత్వం సరైన విధంగా కొనుగోళ్లు చేయడం లేదని ఫైర్ అయ్యారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు మధ్యవర్తుల చేతిలో నష్టపోతున్నారని పేర్కొన్నారు. మార్కెట్లో ధరలు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల నుంచి మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

# రాహుల్ ను విమర్శిస్తే పెద్దోళ్లు అవ్వరు

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనే ముందు మంత్రి సీతక్క బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నిప్పులు చెరిగారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని విమర్శిస్తేనే తాను పెద్ద నాయకుడిని అవుతానని కేటీఆర్ భ్రమపడుతున్నారని ఎద్దేవా చేశారు. తనను ఎవరూ గుర్తించడం లేదనే ఫ్రస్ట్రేషన్‌లో రాహుల్ గాంధీని నిందించడాన్ని కేటీఆర్ అలవాటుగా మార్చుకున్నారని ఆమె మండిపడ్డారు. అసెంబ్లీ ఆవరణలో మంత్రి సీతక్క మీడియాతో ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన 'ఉచిత బస్సు' వంటి ప్రజా ప్రయోజన పథకాలను కూడా కేటీఆర్ ఓర్వలేకపోతున్నారని సీతక్క విమర్శించారు. బీజేపీ వైఫల్యాలపై మాట్లాడాల్సి వస్తే కేటీఆర్‌కు వణుకు పుడుతుందని, అందుకే తమ ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని, చట్టబద్ధత గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. ముఖ్యంగా మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్ పార్టీ కేసును ప్రస్తావించారు. 'కేటీఆర్ ముందు మీ పార్టీ నాయకుల డ్రగ్స్ దందా గురించి మాట్లాడు. బీఆర్ఎస్ నాయకులు తమ వారసత్వాన్ని ఫామ్‌హౌస్‌లలో డ్రగ్ పార్టీల రూపంలో కొనసాగిస్తున్నారు. డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ పార్టీ నేతపై చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే, కేటీఆర్ ఈ సంస్కృతిని ఎలా ప్రోత్సహిస్తున్నారో అర్థమవుతోందని' ఆమె ఘాటుగా విమర్శించారు.తెలంగాణ శాసనసభ, శాసనమండలి బడ్జెట్ సమావేశాలు సోమవారం ఉదయం 11.45 గంటలకు ప్రారంభమయ్యాయి. కొత్త గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. ఆయన స్పీచ్ పూర్తయ్యాక సభ మరుసటి రోజుకి వాయిదా పడుతుంది. అసెంబ్లీ సమావేశాల ఎన్ని రోజులు



నిర్వహించాలనే దానిపై బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బీఏసీ) భేటీని వేర్వేరుగా నిర్వహించి నిర్ణయం తీసుకుంటారు. మార్చి 17, 18 తేదీల్లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఉగాది పండుగ సందర్భంగా మార్చి 19న అసెంబ్లీ ఉభయ సభలకు సెలవు ఇచ్చారు. మార్చి 20న ప్రారంభమయ్యే సమావేశాల్లో అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మండలిలో శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తెలంగాణ బడ్జెట్ 2026ను ప్రవేశపెడతారు. మార్చి 21న రంజాన్, 22న ఆదివారం సందర్భంగా సభలకు విరామం ప్రకటించారు. తిరిగి మార్చి 23 నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాల్లో బడ్జెట్ పద్దులపై చర్చిస్తారు. వైద్యవిధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్పు చేస్తూ చట్టసవరణ, జీహెచ్‌ఎంసీ చట్టసవరణ, గిగ్‌వర్కర్స్ సంక్షేమం సహా పలు బిల్లులను ప్రభుత్వం ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశముంది.

# ఆస్తి పన్ను రాయితీ

## జీహెచ్‌ఎంసీ వాసులకు భారీ ఊరట - ఆస్తి పన్ను వడ్డీలో 90 శాతం డిస్కౌంట్




**-వన్ టైమ్ సెటిల్మెంట్ పథకాన్ని అమలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ**

**-ప్రిన్సిపల్ టాక్స్‌తో పాటు 10% వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది**

**-ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాల్లో చెల్లింపుల సౌకర్యం**

**-ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ సూచన**

హైదరాబాద్, మార్చి 16 (ప్రజాకలం) : హైదరాబాద్ నగర వాసులకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) శుభవార్త ప్రకటించింది. ఆస్తి పన్ను బకాయిలపై పేరుకుపోయిన వడ్డీ మొత్తంలో 90 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. నగర ప్రజలకు ఊరట కలిగించేందుకు 'వన్ టైమ్ సెటిల్మెంట్' (ఓటీఎస్) పథకాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ప్రకారం ఆస్తి యజమానులు తమ పన్ను బకాయిలను ఒకేసారి చెల్లిస్తే వడ్డీలో భారీ తగ్గింపు లభిస్తుంది. అసలు పన్ను మొత్తంతో పాటు మొత్తం వడ్డీలో కేవలం 10 శాతం మాత్రమే చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన 90 శాతం వడ్డీని జీహెచ్‌ఎంసీ పూర్తిగా మాఫీ చేయనుంది. దీంతో చాలా కాలంగా బకాయిలుగా ఉన్న పన్నులను చెల్లించేందుకు పౌరులకు మంచి అవకాశం లభించనుంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న నివాస, వాణిజ్య భవనాలకు ఈ రాయితీ వర్తించనుంది. పన్ను బకాయిలపై పెరిగిన వడ్డీ కారణంగా చాలామంది చెల్లింపులు చేయలేకపోతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆస్తి పన్ను చెల్లింపులను జీహెచ్‌ఎంసీ అధికారిక వెబ్‌సైట్, మైజీహెచ్‌ఎంసీ మొబైల్ యాప్, మీ సేవా కేంద్రాలు, జీహెచ్‌ఎంసీ పౌర సేవా కేంద్రాల ద్వారా సులభంగా చేయవచ్చు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పెండింగ్ పన్నులను త్వరగా క్లియర్ చేసుకోవాలని కమిషనర్ ఆర్వీ కర్ణన్ సూచించారు.

పన్ను బకాయిల వసూళ్లు పెరిగితే నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రోడ్లు, పారిశుధ్య సేవలు వంటి పనులను మరింత మెరుగుపరచడానికి ఉపయోగపడుతుందని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు.

## నాగారం చెరువు కాలువకు అడ్డంగా
# చెక్కలు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



రుద్రంగి, మార్చి 16, (ప్రజాకలం ప్రతినిధి)

ఎల్లంపల్లి గోదావరి జలాలు రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని నాగారం చెరువులోకి వెళ్ళే కాలువ పైపులో గుర్తు తెలియని వ్యక్తులు చెక్కలు అడ్డుగా పెట్టి నీరు వెళ్ళకుండా చేసారు. కాలువ నిండుగా ఉండడం గమనించిన ఇరిగేషన్ అధికారులు కాలువను పరిశీలించగా ప్రవహిస్తున్న నీటికి అడ్డుగా పైపులో చెక్కలు ఉండడం గమనించి పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు కాలువ వద్దకు చేరుకొని అడ్డుగా ఉన్న చెక్కలను తొలగించారు. పంట పొలాలు ఎండిపోకుండా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో నాగారం చెరువుకు ఎల్లంపల్లి గోదావరి జలాలు విడుదల చేస్తే ఇలా చేయడం దారుణం అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకోక గంట ఇలానే ఉంటే కాలువకు గండిపడి పక్కనే ఉన్న పంటలకు ముప్పు ఉండేదని, ఇలా ఎవరు చేసారో ధర్యాప్తు జరిపి వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చందూర్తి సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

# బాధితులకు సత్వర న్యాయం జరగాలి: ఎస్పీ



జగిత్యాల్ ప్రతినిధి మార్చి 16 (ప్రజా కలం)

జగిత్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 14 మంది అర్జీదారులతో ఆయన నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అధికారులు సీరియస్‌గా తీసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను వినాలని, ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ సమస్యలను పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### -: అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్



జగిత్యాల ప్రతినిధి మార్చి 16 (ప్రజాకలం):

ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, వినతులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఆర్డీఓలతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తారని, అధికారులు శాఖల వారీగా అందిన ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించి సమగ్రంగా విచారణ చేపట్టి త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 57 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ మాల వేసుకున్న
# విద్యార్థులకు నో ఎంట్రీ
### - మెట్‌పల్లి ప్రైవేట్ పాఠశాల వద్ద ఉద్రిక్తత

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మార్చి 16:(ప్రజా కలం) జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో హనుమాన్ మాల వేసుకున్న విద్యార్థులను పాఠశాలలోకి అనుమతించకపోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణానికి చెందిన నిఖిల్ భరత్ ప్రైవేట్ పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. హనుమాన్ దీక్ష తీసుకున్న ఐదుగురు విద్యార్థులను




పాఠశాల యాజమాన్యం తరగతులకు అనుమతించకపోవడంతో వివాదం చెలరేగింది. ఈ విషయం తెలుసుకున్న హనుమాన్ మాలధారులు పెద్ద ఎత్తున పాఠశాల వద్దకు చేరుకొని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల మతాచారాలను గౌరవించకుండా ఇలా ప్రవర్తించడం సరైంది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతసేపు పాఠశాల ముందు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ హనుమాన్ దీక్ష కొనసాగుతున్న సమయంలో పాఠశాలకు రావొద్దని చెప్పి, దీక్ష విరమణ అయ్యేవరకు 21 రోజుల పాటు సెలవు తీసుకోవాలని బలవంతంగా లీవ్ లెటర్ రాయించుకున్నారని ఆరోపించారు.

ఇది విద్యార్థుల మత స్వేచ్ఛకు భంగం కలిగించే చర్య అని పేర్కొన్నారు. స్థానికులు కూడా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, మొదటి నుంచే ఈ పాఠశాల యాజమాన్యం ఇలాంటి చర్యలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. విద్యార్థుల హక్కులను గౌరవించాలని, వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు పాఠశాలకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఇరు వర్గాలతో మాట్లాడి ఉద్రిక్తతను చల్లార్చే ప్రయత్నం చేశారు. ఈ ఘటనతో మెట్‌పల్లి పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ విషయం పై పాఠశాల ప్రిన్సిపాల్ ను వివరణ కోరగా తమ పాఠశాలలో అన్ని మతాల, కులాలవారు చదువుతున్నారని. వారిని ఎప్పుడు కూడా వేరుచేసి చూడలేదని అన్ని మతాల పండుగలను భక్తితో నిర్వహిస్తామని. మాలలో ఉంటే తోటి విద్యార్థులకు చదువుపై శ్రద్ధ తగ్గిపోతుందనే ఉద్దేశంతో అలా చెప్పానని. అందులో ఎటువంటి మత విద్వేశం లేదని తెలిపారు.

## మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో
# పోలీస్ కళాబృందం చే విద్యార్థులకు అవగాహన
### - జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు
### - వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో



ఎండపల్లి వెల్గటూర్ మార్చి 16 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజ కవర్గం వెల్గటూర్ మండల కేంద్రం లో సోమవారం రోజున మహాత్మా జ్యోతి భాపులే బీసీ గురుకుల పాఠశాల లో పోలీస్ కళాబృందం ద్వారా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ ఆధ్వర్యం లో జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వెల్గటూర్ లోని మహాత్మా జ్యోతి భాపులే బీసీ గురుకుల పాఠశాల లో పోలీస్ కళాబృందం ద్వారా విద్యార్థులకు అవగాహన కార్య క్రమం నిర్వ హించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసు చట్టాలు, షీ టీమ్, సైబర్ నేరాల పట్ల అప్ర మత్తత, గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాల నివారణ, విద్యార్థుల క్రమశిక్షణ, డయల్ -100 వంటి అంశాలపై విద్యార్థుల కు అవగాహన కల్పించడం జరి గింది. ఈ సందర్భంగా పోలీసు కళాబృందం వివిధ చట్టాలు, సామాజిక సమస్యల పై పాటల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని సైబర్ నేరాల పట్ల అప్ర మత్తంగా ఉండాలని ఎలాంటి మోసాలకు గురి కాకుండా జాగ్రత్త గా మెలగాలని సూచించారు. అలాగే మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అదే విధంగా 10 వ తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని వెల్గటూర్ ఎస్సై పులిచెర్ల ఉదయ్ కుమార్ తెలిపారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు అందుకున్న సుంచు మల్లేశం
### - బహుజన సాహిత్యాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్న జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ

ఎండపల్లి, ధర్మారం మార్చి 16 : ( ప్రజా కలం ప్రతినిధి )

ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి లో మార్చి 15 న సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 18 వ నేషనల్ కాన్ఫరెన్స్ లో బహుజన సాహిత్య అకాడమీ (బిఎస్ఏ) జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఆధ్వర్యం లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిబాపూలే నేషనల్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వ హించారు. సౌత్ ఇండియాలోని ఆరు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల నుండి 600 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్ కు హాజరైనట్టు నల్ల రామకృష్ణ తెలిపారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన సుంచు మల్లేశం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నేషనల్ అవార్డు 2026 కు ఎంపిక కాగా ఆయనకు మెమొంటో, శీల్డ్, సర్టిఫికెట్ అందించి సత్కరించారు. ఇదే మండలం లోని కొత్తూరు గ్రామానికి చెందిన బహుజన నాయకుడు కొక్కుల రాంనారాయణ మహాత్మా జ్యోతిబాపూలే నేషనల్ అవార్డు 2026 కు ఎంపిక కాగా ఆయనకు అవార్డు, సీల్డ్, సర్టిఫికెట్ ను నల్ల రాధాకృష్ణ అందించి శుభాకాంక్ష లు తెలిపారు. అనంతరం నల్ల రాధాకృష్ణ, జాతీయ



ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు సుబ్ర మనియన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ నుండి ప్రతిఏటా ప్రజా ఉద్యమ కారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కౌవులకు, స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డుల ను అందజేసిన్నట్లు రాధాకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమం లో సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీ జి విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు విజయ్ కుమార్, తాటికొండ ఐలయ్య, మామిడిపెల్లి బాబయ్య, బాదే వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ కార్మికులకు ఆత్మీయ సన్మానం..

మల్లాపూర్ మర్చి 16 ( ప్రజా కలం ప్రతినిధి ) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలనా – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలం లోని కొత్త ధామ్ రాజ్ పల్లి గ్రామంలో సర్పంచ్ ఎగ్యారపు లింబాద్రి, కార్యదర్శి వంశీదర్ రెడ్డి అద్వర్యం లో పరిశుద్ధ కార్మికులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా పరిశుద్ధ కార్మికులకు శాలువాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. గ్రామ పరిశుభ్రత కోసం వారు చేస్తున్న కృషి ఎంతో గొప్పదని నాయకులు పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో



పరిశుద్ధ కార్మికుల పాత్ర ముఖ్యమని, వారి సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బద్దం హరీష్, వార్డ్ సభ్యులు గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్లను అరెస్ట్ చేసిన పోలీసులు




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మార్చి 16 (ప్రజా కలం)

హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాలో పాల్గొనేందుకు వెళ్లేందుకు సిద్ధమైన మెట్‌పల్లి పట్టణానికి చెందిన అంగన్వాడీ టీచర్లను పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన చోటుచేసుకుంది. ధర్నాకు వెళ్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు ముందస్తు చర్యగా వారిని అడ్డుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మెట్‌పల్లి పట్టణం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయత్నం చేస్తున్న అంగన్వాడీ టీచర్లను పోలీసులు నిలిపివేసి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర స్థాయిలో అంగన్వాడీ సిబ్బంది చేపట్టిన ఆందోళనలకు మద్దతుగా వారు ధర్నాలో పాల్గొనడానికి వెళ్తున్నట్లు సమాచారం. అయితే పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉండటంతో పోలీసులు ముందస్తు చర్యగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వారిలో గంగాల లక్ష్మి, విజయ, సుజాత, సుమలత, మదస్తు లక్ష్మి, మంగా, అనురాధ, చైత్ర, విజయలక్ష్మి, రజినీ, రజిత, సఫియ, జి. విజయ లక్ష్మీ, అమృత, వనజ, శ్రీదేవి, నజిమ తదితరులు కలిపి దాదాపు 20 మంది ఉన్నారు. ఈ ఘటనతో మెట్‌పల్లి ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

# ఇసుక అక్రమ రవాణా
### - పట్టించుకోని అధికారులు




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మార్చి 16 (ప్రజా కలం)

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలో అక్రమ ఇసుక రవాణా నిర్బంధం లేకుండా కొనసాగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జగ్గసాగర్, రామలచ్చక్కపేట, ఆత్మనగర్, ఆత్మకూర్ గ్రామాల పరిధిలోని వాగుల నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అక్రమార్కులు గ్రామాల్లోని ఇళ్ల మధ్యలోనే ఇసుక డంపులు చేసి, ఒకేసారి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# సర్పంచ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి మార్చి 16 (ప్రజాకలం) మండలంలోని జగ్గాసాగర్ గ్రామ సర్పంచ్ పుల్ల సాయగౌడ్ జగన్ ఆధ్వర్యంలో సోమవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మత సామరస్యానికి ప్రతికగా అందరు సోదర భావంతో కలిసి మేలిసి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అజహర్, మెంబెర్ సుల్తాన్, జమీల్, కరీం, జావీద్, రహీమ్, రవి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజారాంపల్లి గ్రామంలో నూతన శివాలయం కోసం భూమి చదును చేసిన సందర్భంగా
### - భూమి దాత ఏలేటి చంద్రారెడ్డి
### - గ్రామ సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో



ఎండపల్లి, మార్చి 16 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామం లో సోమవారం రోజున నూతన శివాలయం కోసం భూమి చదును చేయడం జరిగింది. ఈ సంద ర్భంగా భూమి దాత ఏలేటి చంద్రా రెడ్డి, భూమి ఇవ్వగా రాజారాం పల్లి గ్రామ సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్ ఆధ్వర్యం లో భూమి చదును చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో భూదాత ఎలేటి చంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నట్లు గ్రామ సర్పంచ్ సంఘ రమేష్ యాదవ్ తెలిపారు.

ప్రజా కలం


మంగళవారం, మార్చి 17, 2026

# ఢిల్లీలో దోస్తి... గల్లీలో కుస్తీ

ప్రస్తుతం భారత రాజకీయాల్లో 'శత్రువుకు శత్రువు మిత్రుడు' అనే సూత్రం విపక్షాల ఐక్యతకు దిక్సూచిగా మారింది. ఇండీ కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నప్పటికీ, లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం మరియు సీఈసీపై అభిశంసన తీర్మానం వంటి అంశాలు విపక్షాలను ఏకం చేయడానికి రాజకీయ అస్త్రాలుగా దొరికాయి. ఇవి కేవలం తీర్మానాలు మాత్రమే కావు, విపక్షాల ఐక్యతకు ఒక 'లిట్మస్ టెస్ట్' వంటివి. సంఖ్యాబలం లేకపోయినా ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో నెట్టగలమనే ఆత్మవిశ్వాసాన్ని ఇవి విపక్షాల్లో నింపాయి. అయితే, ఢిల్లీ స్థాయిలో కనిపిస్తున్న ఈ ఐక్యత రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి మాయమవుతోంది. బెంగాల్‌లో మమత వర్సెస్ కాంగ్రెస్–లెఫ్ట్, కేరళలో ఎల్డీఎఫ్ వర్సెస్ యూడీఎఫ్ పోరు విపక్షాల ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోంది. సీట్ల సర్దుబాటు, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలు ఈ కూటమికి పెను సవాలుగా మారాయి. తమిళనాడు, మహారాష్ట్రలో పొత్తులు బలంగా ఉన్నప్పటికీ, పంజాబ్, కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో విపక్షాల మధ్య 'పగటి పూట స్నేహం – రాత్రి పూట యుద్ధం' అనే చందంగా రాజకీయాలు సాగుతున్నాయి. శత్రువుకు శత్రువు మిత్రుడు అవుతారంటారు. ప్రస్తుతం దేశ రాజకీయాలు ఈ సమీకరణంతోనే నడుస్తున్నాయి. ముఖ్యంగా విపక్ష కూటమి. పైకి చూస్తే ఎవరికి వారే అన్నట్టుగా కనిపిస్తున్నా.. రాజకీయ శత్రువు కళ్ల ముందు కనిపించే సరికి.. ఏకం అవ్వాలనే కసి పెరుగుతోంది. నిజానికి, విపక్షాలకీ కలవాలనుంది. కలవడానికి బలమైన కారణాలూ ఉన్నాయ్. ఇండీ కూటమి విచ్ఛిన్నమైనా విపక్షాల్ని ఏకం చేయడానికి అస్త్రాలు వరుసగా దొరుకుతున్నాయ్. అందులో మొదటిది లోక్‌సభ స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం. అఫ్‌కోర్స్ ఆ తీర్మానం వీగిపోయింది. రెండ్రోజుల చర్చ తరువాత.. బుధవారం సాయంత్రం నాటి ఓటింగ్‌లో మూజువాణి ఓటుతో ఆ తీర్మానాన్ని తిరస్కరించింది లోక్‌సభ. నిజానికీ ఈ తీర్మానం వీగిపోతుందని విపక్షానికి కూడా తెలుసు. కాకపోతే.. అందులో ఓ రాజకీయ వ్యూహం ఉంది. ఇండీ కూటమి ఐక్యతకు అదో లిట్మస్ టెస్ట్ లాంటిది. ఈ తీర్మానం విపక్షాల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కన పెట్టి, వారిని ఒకే తాటిపైకి తెచ్చింది. ఎలా చెప్పగలరు అలా అంటే.. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు కలిసి ఉమ్మడిగా నోటీసు ఇచ్చాయి. తీర్మానంపై చర్చ జరిగినప్పుడు కూడా ఒక్కటిగానే నిలబడ్డాయి. ఓటింగ్ సమయంలో కలిసే ఉండాలని మాట్లాడుకున్నాయి. ఓవరాల్‌గా.. సీట్ల సర్దుబాటులో సమస్యలు ఉన్నప్పటికీ.. బీజేపీ వ్యతిరేక పోరాటంలో తామంతా ఒక్కటేననే సంకేతాన్ని ప్రజల్లోకి పంపాయి విపక్షాలు. అటు బెంగాల్ లో మాత్రం పశ్చిమ బెంగాల్‌లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తమ ఉనికిని చాటుకోవడంతో పాటు మమతా బెనర్జీని గద్దె దించడమే పరమావధిగా ముందుకు సాగుతున్నాయి. గత ఎన్నికల్లో సున్నా స్థానాలకే పరిమితమైన ఈ కూటమి, ఈసారి క్షేత్రస్థాయిలో టీఎంసీ వ్యతిరేక ఓటును బీజేపీ వైపు మళ్లకుండా తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా తృణమూల్ ప్రభుత్వంపై ఉన్న అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలను అస్త్రాలుగా చేసుకుని మమతా కంచుకోటలను బద్దలు కొట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మమతా బెనర్జీకి అండగా నిలిచే మైనారిటీ , గ్రామీణ ఓటు బ్యాంకును దెబ్బతీయడం ఈ కూటమి ప్రధాన ఉద్దేశం. గతంలో కాంగ్రెస్‌కు పట్టున్న మాల్డా, ముర్షిదాబాద్ వంటి జిల్లాల్లో టీఎంసీని అడ్డుకుంటే, రాష్ట్రస్థాయిలో మమతా ప్రాభవం తగ్గుతుందని వీరి అంచనా. మమతా బెనర్జీకి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతి ఓటు తమకే పడాలని, తద్వారా టీఎంసీని బలహీనపరిచి మళ్లీ రాష్ట్రంలో తాము ఒక నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని లెఫ్ట్–కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ టాస్క్ లో భాగంగానే వీరు సంయుక్తంగా భారీ ర్యాలీలు నిర్వహిస్తూ క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారు. టీఎంసీకి వ్యతిరేకంగా నిరంతరం వీధుల్లో పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ , డీవైఎఫ్ఐ వంటి యువజన సంఘాలను లెఫ్ట్ కూటమి ముందు వరుసలో నిలుపుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జరిగిన కుంభకోణాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మమతా బెనర్జీ క్లీన్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారు. మమతా బెనర్జీని పూర్తిగా ఓడించలేకపోయినా, ఆమెకు మ్యాజిక్ ఫిగర్ అందకుండా చేయడమే ఈ కూటమి అసలు టాస్క్. తద్వారా రాష్ట్రంలో టీఎంసీ ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట వేయవచ్చని వీరు భావిస్తున్నారు. మమతా వ్యతిరేక ఓట్లు కేవలం బీజేపీకే పడతాయనే భ్రమను తొలగించి, తటస్థ ఓటర్లను తమ వైపు తిప్పుకోవడంలో ఈ కూటమి ఎంతవరకు సఫలమవుతుందనేది బెంగాల్ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఒకవేళ వీరు గణనీయమైన స్థానాలు సాధిస్తే, అది బెంగాల్ రాజకీయాల్లో మమతా శకానికి ముగింపు పలికే తొలి అడుగు అవుతుందని అనుకోవచ్చు. మరో వైపు ఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రవేశపెట్టిన తీర్మానం నోటీసులో విపక్షాలు ఏడు ప్రధాన ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని, అనుచిత ప్రవర్తన రుజువైందని, ఎన్నికల అవకతవకలపై విచారణను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని, సామూహికంగా ఓటుహక్కును రద్దుచేశారని విపక్షాలు ఆరోపించాయి. కొన్ని పార్టీలకు అనుకూలంగా పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని కూడా నోటీసులో పేర్కొన్నాయి. తమ ఆరోపణలకు బలంచేకూర్చే పలు సుప్రీంకోర్టు తీర్పులను సైతం నోటీసులో ప్రస్తావించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా సీఈసీ వ్యవహరిస్తున్నారని ఆరోపించాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలోనే సీఈసీని తొలగించాల్సి ఉంటుంది. ఇందుకు లోక్‌సభలో 100 మంది, రాజ్యసభలో 50 మంది సంతకాలు అవసరం. స్పీకర్ నోటీసును అంగీకరిస్తే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఈ ఆరోపణలను పరిశీలిస్తుంది.

# కాంగ్రెస్ హామీల అమలులో విఫలం

## - బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్




జూలపల్లి,మార్చి16 (ప్రజాకలం జిల్లాప్రతినిధి):

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు మరియు ఇతర హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ధ్వజమెత్తారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సోమవారం జూలపల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాగ్దానాలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొప్పుల మహేష్ మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను వంచించిన కాంగ్రెస్, గద్దెనెక్కిన తర్వాత వాటిని గాలికొదిలేసిందని విమర్శించారు. ముఖ్యంగా యువతకు ఇస్తానన్న జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఊసే లేదని, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్ల పెంపు విషయంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, పేదలకు గృహ నిర్మాణ పథకం, మహిళలకు గృహలక్ష్మి మరియు విద్యార్థినులకు స్కూటీ వంటి వాగ్దానాలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. మరోవైపు రైతులకు రైతు భరోసా, కూలీలకు రైతుబంధు అందించడంలోనూ, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంలోనూ ప్రభుత్వం విఫలమైందని, దీంతో సామాన్య ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి హామీలను నెరవేర్చని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జనరల్ సెక్రెటరీ బడుగు శ్రీనివాస్, సీనియర్ నాయకులు భూసార రవీందర్ గౌడ్, చొప్పరి నరసన్న, పూసుకుంట మోహన్ రెడ్డి, వైద్య లక్ష్మణ్, బూత్ అధ్యక్షులు ఆవుల రాజు, దేవసాని సూర్యనారాయణ, మహమ్మద్ రఫీతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్షర సేద్యం చేస్తున్న గురువుల ఆకలి కేకలు

## - ప్రజా ప్రభుత్వంలో ప్రైవేట్ అధ్యాపకులకు పస్తులేనా



పెద్దపల్లి,మార్చి16 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి):

సమాజానికి దిశానిర్దేశం చేస్తూ, భావి భారత పౌరులను తీర్చిదిద్దే గురువులు నేడు అగమ్యగోచర స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉన్నత చదువులు చదివి, ప్రభుత్వ ఉద్యోగాలు రాక, గత్యంతరం లేక ప్రైవేట్ కళాశాలల్లో అధ్యాపకులుగా చేరుతున్న మేధావులకు ఇప్పుడు కనీసం పస్తులు తప్పని దుస్థితి నెలకొంది. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం నుంచి అందాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు నిలిచిపోవడంతో, ప్రైవేట్ కళాశాలల్లో పని చేస్తున్న వేలమంది బోధన, బోధనేతర సిబ్బంది రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఒక ఆవేదన భరిత నిరసనకు సాక్ష్యంగా నిలిచింది. జిల్లాలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల అధ్యాపక బృందం కలెక్టరేట్ పరిపాలనాధికారి బండి ప్రకాష్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు సమర్పించిన వినతిపత్రంలో తమ దయనీయ స్థితిని వివరించారు. ప్రభుత్వం కళాశాల యాజమాన్యాలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో, తమకు నెలనెలా అందాల్సిన అరకొర జీతాలు కూడా అందక తీవ్ర అవస్థలు పడుతున్నామని వారు వాపోయారు. ఇతరుల బిడ్డలకు పాఠాలు చెబుతూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న మేము, కనీసం మా సొంత పిల్లల స్కూల్ ఫీజులు కూడా చెల్లించలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నామని అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల నిర్వహణ భారమైందని, తద్వారా సిబ్బందికి వేతనాలు ఇవ్వలేకపోతున్నామని యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయని వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ బకాయిలను విడుదల చేయకపోతే, ఆర్థిక ఇబ్బందుల వల్ల బోధనా సిబ్బంది అందరూ ఈ పవిత్రమైన వృత్తిని వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని, మానవతా దృక్పథంతో ఆలోచించి నిలిచిపోయిన నిధులను వెంటనే విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న తమ కుటుంబాలను ఆదుకుని, ప్రైవేట్ విద్యా వ్యవస్థ కుప్పకూలకుండా కాపాడాలని అధ్యాపక లోకం వేడుకుంటోంది. మరి ఈ ప్రజా ప్రభుత్వం అక్షర సైనికుల ఆకలి తీర్చి, వారికి భరోసా కల్పిస్తుందో లేదో వేచి చూడాలి.

# పారిశ్రామిక విద్యుత్ సేవలకు సింగిల్ విండో భరోసా

## -సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ వి.గంగాధర్



పెద్దపల్లి,మార్చి16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

వినియోగదారులకు హెచ్.టి 11కేవీ, 33కేవీ అంతకంటే ఎక్కువ వోల్టేజి విద్యుత్ సర్వీసుల మంజూరును వేగవంతం చేసేందుకు సింగిల్ విండో వ్యవస్థ ఎంతో దోహదపడుతుందని పెద్దపల్లి సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ వి.గంగాధర్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నూతన విధానం ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 26 హెచ్.టి సర్వీసులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం విద్యుత్ కనెక్షన్ల ప్రక్రియ అత్యంత సరళీకృతం అయ్యిందని, దీనికోసం ప్రత్యేకంగా సర్కిల్ మరియు కార్పొరేట్ కార్యాలయాల్లో హెచ్.టి మానిటరింగ్ సెల్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ వ్యవస్థ పనితీరును వివరిస్తూ.. 11కేవీ వోల్టేజి దరఖాస్తులను సర్కిల్ కార్యాలయ ఏ.డి.ఈ అధికారి, అలాగే 33 కేవీ మరియు అంతకంటే ఎక్కువ వోల్టేజి దరఖాస్తులను కార్పొరేట్ కార్యాలయ ఏ.డి.ఈ అధికారి నిరంతరం పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. టీజీ–ఐపాస్ పరిధిలోకి రాని హెచ్.టి దరఖాస్తుదారులు మొదట టీజీఎన్‌పీడీసీఎల్ పోర్టల్‌లో అవసరమైన పత్రాలతో నమోదు చేసుకోవాలని, దరఖాస్తు పూర్తికాగానే ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఉత్పన్నమవుతుందని తెలిపారు. ఇలా వచ్చిన దరఖాస్తులు వెంటనే సంబంధిత అధికారుల డాష్ బోర్డులో కనిపిస్తాయని, క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే సదరు ప్రాంతాన్ని సందర్శించి మౌలిక సదుపాయాల లభ్యతను పరిశీలిస్తారని వివరించారు. 11కేవీ దరఖాస్తుల విషయంలో అన్నీ సక్రమంగా ఉంటే రెండు రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తామని, ఒకవేళ ఏదైనా సాంకేతిక కారణాల వల్ల సాధ్యపడకపోతే ఆ విషయాన్ని వెంటనే వినియోగదారుడికి ఎస్.ఎం.ఎస్ ద్వారా తెలియజేస్తామని ఎస్.ఈ తెలిపారు. 33 కేవీ మరియు అంతకంటే ఎక్కువ వోల్టేజి దరఖాస్తులను అనుమతుల కోసం హైదరాబాద్‌లోని టీజీ ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు ఆన్‌లైన్ ద్వారా పంపిస్తామన్నారు. ఈ సింగిల్ విండో విధానం వల్ల పారదర్శకత పెరుగుతుందని, వినియోగదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా తమ దరఖాస్తు స్థితిగతులను ఎప్పటికప్పుడు మొబైల్ ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

# గంజాయి తో పట్టుబడ్డ ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

## - ధర్మపురి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసిన ఎస్ఐ జి మహేష్




ఎండపల్లి, ధర్మపురి మార్చి 16 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాయపట్నం గ్రామం లో సోమవారం రోజున సాయంత్రం 7:00 గంటల ప్రాంతం లో ధర్మపురి మండలం రాయపట్నం గ్రామానికి చెందిన నలిమెల విష్ణు వయస్సు (21) సంవత్సరాల అనే వ్యక్తి అక్రమణ గంజాయి కొను గోలు చేయడానికి లక్షెట్టిపేటకి చెందిన కండ్ల ప్రదీప్ వయస్సు (32) సంవత్సరాల అనే వ్యక్తికి కబురు చేయగా అతడు రాయపట్నాని కి గంజాయి తో చేరుకోగానే పక్క సమాచారం మేరకు ధర్మపురి పోలీస్ వారు అక్కడకి చేరుకుని నిందితులకు పంచనామ నిర్వహించి వారి వద్ద నుండి 100 గ్రాముల నిషేధిత గంజాయినీ, సెల్ ఫోన్ ను స్వాధీ న పరచుకోవడం జరిగింది. పంచనామా అనంతరం నిందితులను ధర్మపురి పోలీస్ స్టేషన్ కి తరలించి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మపురి ఎస్సై జి మహేష్ తెలిపారు.

## శానబండ గ్రామంలో పశువులకు

# ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు



ఎండపల్లి, మార్చి 16 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలంలోని శానబండ గ్రామం లో సోమవారం రోజున పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగింది. పశువులు 43 (ఆవులు, ఎడ్లు), 26 గేదెలకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను పశువులకు వేయడం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న శానబండ గ్రామ సర్పంచ్ గాదం భాస్కర్, ఉప సర్పంచ్ కదారి రజిత, కార్యదర్శి మారుతి, వార్డు సభ్యులు, గాదం శ్రావన్ కుమార్, శంకరయ్య, రవి, మల్లేష్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో వెల్గటూర్ మండల పశు వైద్యాధికారిని డాక్టర్ పి శ్రీ ప్రియ, సిబ్బంది, ఎస్ రాజేందర్, జి నవీన్, కె కుమార్, పి లక్ష్మి పాల్గొన్నట్లు మండల పశువైద్యాధికారిని డాక్టర్ పి శ్రీ ప్రియ తెలిపారు.

# వైభవంగా శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణం



గొల్లపల్లి మార్చి 16 ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలంలో చిల్వకోడూర్ గ్రామంలోనీ శ్రీ రామలింగేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు సాయి గణేశ్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి వేద మంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. జాతర ఉత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తుల విగ్రహాలకు మేళా తాళాల మధ్య ఆలయ అర్చకులు ఘనంగా కళ్యాణం జరిపించారు. స్వామి వారి కళ్యాణాన్ని తిలకించడానికి స్థానికి గ్రామ ప్రజలు తో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దాతలు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పురోహితులు నవీన్ శర్మ , భాస్కర్ శర్మ, గ్రామ సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్ ఉప సర్పంచ్ దీటి మహేష్ ఆలయ వైస్ చైర్మన్ కొమురయ్య, భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

## -పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య



పెద్దపల్లి,మార్చి16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య తో పాటు పాలనాధికారి బి. ప్రకాష్ కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ పట్టణం చెందిన గెల్లు కేతమ్మ వృధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య తెలిపారు. అంతర్గం గ్రామానికి చెందిన కొంకటి స్వరూప గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల యూనిఫాం కుట్టించే టెండర్ ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యా శాఖ అధికారికి రాస్తూ పరిశీలించాలని తెలిపారు. ఎలిగేడు మండలం శివపల్లి గ్రామానికి చెందిన తాండ్ర సుమన్ గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎలాంటి పన్ను లు చెల్లించకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బృంద ఫంక్షన్ హాల్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేయగా జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారి గంగయ్య తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కరాటే పోటీల్లో గాయత్రి విద్యార్థుల జోరు

పెద్దపల్లి,మార్చి16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని ఓకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మార్చి 15న నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్షిప్‌లో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన ఎన్.సాధ్వి జెస్సి, జె.సాత్విక్, శ్రీయన్, సన్యూ జనత్ బంగారు పతకాలు సాధించగా, ఎన్.సాన్వి జెస్సి, పి.సహస్ర, పి.సాయి వర్షిత్ రజిత పతకాలు, అలాగే ఎం.సుప్రత్, ఏ.రీతిక్, జి.ప్రతిక్షి, జె.సహస్ర, బి.ఆరాధ్య, శ్రీ ఆధ్యలు కాంస్య పతకాలను గెలుచుకున్నారు. విజేతలకు రాష్ట్ర కరాటే వైస్ ప్రెసిడెంట్ కె.వసంత్ కుమార్ చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల ప్రతిభను, వారిలోని క్రమశిక్షణను గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, కరాటే కోచ్ ప్రవీణ్, పీఈటీలు అజయ్ కుమార్, మంజుల తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.



# దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకం



## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

నిర్మల్ మార్చి16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అన్నారు.

భారత జనాభా గణన – 2027 కి సంబంధించి, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సోమవారం అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో జనగణన ప్రక్రియ కీలక భూమిక పోషిస్తుందని అన్నారు. అధికారులు చేపట్టే జనగణన ఆధారంగానే ప్రభుత్వం ప్రజలకు అవసరమయ్యే పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన, ఇతర ప్రజా ప్రయోజనాల రూపకల్పనలో జనగణన ప్రక్రియ ఆధారం అని అన్నారు. దేశాభివృద్ధికి దిక్సూచిలా నిలిచే జనాభా గణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జనగణన ప్రక్రియకు సంబంధించి, గృహాల గుర్తింపు, జనగణన వివరాల నమోదులో తప్పులకు తావు ఉండకూడదని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లు అందించే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలని వివరించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. జనగణన ప్రక్రియను బాధ్యతగా నిర్వర్తించి, విజయవంతం చేయాలన్నారు.

మాస్టర్ ట్రైనర్లు అధికారులకు జనగణనకు సంబంధించి అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, సీపీఓ జీవరత్నం, డిపివో శ్రీనివాస్, జెడ్పీ సీఈవో శంకర్,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మల్లాపూర్ మర్చి 16 ( ప్రజా కలం ప్రతినిధి )

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ మల్లాపూర్ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని, కానీ ఇప్పటివరకు వాటిలో చాలా హామీలు అమలు కాలేదని విమర్శించారు. ముఖ్యంగా యువతకు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, వృద్ధాప్య, వితంతు మరియు దివ్యాంగులకు పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, పేదలకు గృహ నిర్మాణ పథకం, రైతులకు రైతు భరోసా వంటి హామీలు అమలు కాలేదని తెలిపారు. మండలంలోని రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు భరోసా సమయానికి అందకపోవడంతో అప్పులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. అలాగే అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆసరా పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు.

పేదలకు గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, వీధి దీపాలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

అలాగే నివాస, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల జారీలో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించి నిర్ణీత సమయంలో పత్రాలు జారీ చేయాలని రెవెన్యూ అధికారిని కోరారు. మండల పరిధిలోని ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## రైతులు కూరగాయల పంటల సాగు విస్తీర్ణం పెంచాలి

### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ మార్చి16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

రైతులు జిల్లాలో కూరగాయల పంటల సాగు విస్తీర్ణం పెంచాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, కలెక్టరేట్లోని తన చాంబర్లో సోమవారం పలువురు రైతులకు, ఉచిత ఐదు రకాల కూరగాయల విత్తనాలు గల కిట్ లను అందించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రైతులు కూరగాయల సాగును పెంచేలా కృషి చేయాలని అన్నారు. ఐదు రకాల కూరగాయల విత్తనాలు గల కిట్ ల ద్వారా రైతులకు మేలు కలుగుతుందని అన్నారు. ఈ విత్తనాల ద్వారా నాణ్యమైన కూరగాయలు ఉత్పత్తి అవుతాయని పేర్కొన్నారు. రైతులందరూ ఈ విత్తనాలను సాగు చేసేలా దృష్టి సారించాలని సూచించారు. ఉద్యానవన పంటల అధికారుల మండలాలలో ఈ విత్తనాల కిట్లు పంపిణీ చేయబడతాయని వివరించారు. ఈ విత్తనాలు అర ఎకరంలో సాగు చేయడానికి సరిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# అప్రెంటిస్‌షిప్‌లతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయా?

### - లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్న
### - శిక్షణ అనంతరం 72 శాతం మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయంటూ కేంద్రం వెల్లడి



ఖమ్మం మర్చి 16(ప్రజా కలం న్యూస్ )

పరిశ్రమల్లో నైపుణ్య శిక్షణతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచే లక్ష్యంతో అమలు చేస్తున్న జాతీయ అప్రెంటిస్‌షిప్ ప్రోత్సాహక పథకం (ఎన్ఏపీఎస్) ఫలితాలపై లోక్‌సభలో చర్చ జరిగింది. పథకం అమలు పరిస్థితులు, అప్రెంటిస్ నియామకాల లక్ష్యాలు, సాధించిన గణాంకాలపై ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి..మలి విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

గత ఆర్థిక సంవత్సరం మరియు ఈ ఏడాదికి సంబంధించి అప్రెంటిస్‌ల నియామకాలు ఎంతవరకు జరిగాయి? ఏ రంగాల్లో శిక్షణ అందిస్తున్నారు? యువతకు ఉపాధి అవకాశాల పెంపులో ఈ పథకం ఎంతవరకు సహకరిస్తోందని ఆయన అడిగారు.

దీనికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌధరి లిఖిత సమాధానం ఇచ్చారు. అప్రెంటిస్‌లకు చెల్లించే కనీస భృతిలో 25 శాతం వరకు (గరిష్ఠంగా నెలకు రూ. 1500) కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం అందిస్తోందని తెలిపారు. ఈ మొత్తాన్ని నేరుగా డీబీటీ ద్వారా అప్రెంటిస్‌ల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు.

**లక్ష్యాలు – నియామకాలు**

2024–25 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం 12 లక్షలు కాగా 9.85 లక్షల మంది అప్రెంటిస్‌లను నియమించినట్లు తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం 13 లక్షలు కాగా, ఇప్పటివరకు 9.24 లక్షల మంది అప్రెంటిస్‌లను నియమించినట్లు చెప్పారు.

ఆటోమొబైల్, సమాచార సాంకేతిక సేవలు, ఎలక్ట్రానిక్స్, రిటైల్, తయారీ, పర్యాటకం, టెలికాం, సరుకు రవాణా తదితర రంగాల్లో అప్రెంటిస్ శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. 72 శాతం అప్రెంటిస్‌లు శిక్షణ అనంతరం పూర్తి స్థాయి ఉద్యోగ అవకాశాలు పొందినట్లు వెల్లడైందన్నారు.

**వ్యవస్థ బలోపేతానికి చర్యలు**

అప్రెంటిస్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు భృతిలో 36 శాతం పెంపు, మిశ్రమ శిక్షణ విధానం, వికలాంగులకు అవకాశాలు, కొత్త రంగాల్లో అప్రెంటిస్ అవకాశాల విస్తరణ వంటి చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి: పాలేరు పాఠశాలలో వ్యాసరచన పోటీలు



పాలేరు , మార్చి 16(ప్రజా కలం న్యూస్ ) పొట్టి శ్రీరాములు, జయంతి సందర్భంగా పాలేరు ప్రభుత్వ పాఠశాలలో 'యువత మేలుకో' ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆ మహనీయుడి జీవితం, ఆదర్శాల గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే, ఎండాకాలం మొదలైన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సెషన్ ఏర్పాటు చేశారు. పోటీలలో పాల్గొన్న పిల్లలకు ఎండాకాలంలో అవసరమైన వాటర్ బాటిల్స్, క్యాప్స్, కళ్ళజోళ్ళు వితరించారు. ఈ కార్యక్రమంలో 'యువత మేలుకో' ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శీలం రామకృష్ణ, సభ్యులు బండారు రాజు, బొంకూరి నాగార్జునలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

### - గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం
### - జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల




నిర్మల్ మార్చి 16( ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..... ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# మానవ హక్కుల ఉల్లంఘన ఆపాలి

### సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం - ఇరాన్‌పై దాడులను ఖండిస్తూ సీపీఐ శ్రేణుల ధర్నా




పెద్దపల్లి,మార్చి 16:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రపంచానికి కావాల్సింది అణ్వాయుధాలు కాదు,శాంతి అని,సామ్రాజ్యవాద కాంక్షతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేతిలో కీలుబొమ్మగా మారిన ఇజ్రాయెల్ ఇరాన్‌పై జరుపుతున్న దాడులు అంతర్జాతీయ హక్కుల ఉల్లంఘన అని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ధ్వజమెత్తారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ముందు సీపీఐ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన ఆర్థిక ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు ఇజ్రాయెల్‌ను అడ్డం పెట్టుకుని రక్తం మరిగిన అడవి జంతువులా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఇరాన్‌పై యుద్ధం ప్రకటించి వేలాది మంది అమాయక ప్రజలను బలి తీసుకుంటున్నారని,యుద్ధం వల్ల కార్మికులు,రైతులు,పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాల మధ్య విభేదాలను యుద్ధం ద్వారా కాకుండా చర్చల ద్వారా,పరస్పర గౌరవంతో పరిష్కరించుకోవాలని,లేనిపక్షంలో అంతర్జాతీయ శాంతికి ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. అమెరికా యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రపంచంలోని శాంతి ప్రియులు,కార్మిక వర్గం ఐక్యంగా గళం విప్పాలని పిలుపునిచ్చారు. దేశంలో విపరీతంగా పెరిగిన నిత్యావసర సరుకులు,గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గౌతమ్ గోవర్ధన్, కె.కనకరాజు, మణికొండ ఓదెమ్మ,మార్కాపూరి సూర్య,తాళ్లపల్లి లక్ష్మణ్, కౌన్సిల్ సభ్యులు ఆరెపల్లి మానస్ కుమార్,రేణుకుంట్ల రమ,బాలసాని లెనిన్, రాజారత్నం,కల్లెపల్లి నవీన్,చంద్రగిరి ఉదయ్, నాగరాజు,సుధీర్,శివ,పోలు యాదగిరి, రామస్వామి,మాచర్ల లక్ష్మణ్,సుద్దాల అనురాజ్, జూపక రాంచందర్,శనిగరం తిరుమల,రేణుక తదితరులు పాల్గొన్నారు.

# నేడు బాలల హక్కులపై అవగాహన సదస్సు

### -సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్ రావు

పెద్దపల్లి,మార్చి16:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్ రావు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ సదస్సును ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం.చందన ముఖ్య అతిథిగా హాజరై,ప్రస్తుత సమాజంలో బాలలు ఎదుర్కొంటున్న సవాళ్లు మరియు వారి హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సమగ్రంగా వివరించనున్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల నిర్మూలన,బాల కార్మిక వ్యవస్థ రూపుమాపడం,పిల్లల విద్య మరియు ఆరోగ్యంపై తల్లిదండ్రులకు ఉన్న బాధ్యతలను ఈ సదస్సులో చర్చించనున్నారు. దేశ భవిష్యత్తు రేపటి పౌరులైన పిల్లల చేతుల్లోనే ఉందని,వారిని సురక్షితమైన వాతావరణంలో పెంచడం మనందరి కనీస బాధ్యతని వేణుగోపాల్ రావు స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సును విజయవంతం చేసేందుకు విద్యార్థులు,మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ధర్మారం మండల కేంద్రంలో ఆరు గ్యారంటీ లపై తాసిల్దార్ కు వినతి



ఎండపల్లి, ధర్మారం ఫిబ్రవరి 16 : ( ప్రజా కలం ప్రతినిధి)

ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండల కేంద్రం లోని తాసిల్దార్ కు బీజేపి మండల అధ్యక్షులు తీగుళ్ల సతీష్ రెడ్డి ఆధ్వర్యం లో తాసిల్దార్ కు ఆరు గ్యారంటీ లను అమలు పరచటం లో కాంగ్రెస్ విఫలమైనదని సతీష్ రెడ్డి ఆధ్వర్యం లో సోమవారం రోజున తాసిల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. బీజేపి నాయ కులు మాట్లాడుతూ, రైతులకు రైతుబంధు, బోనస్ ఇవ్వడంలో, అలాగే మహిళలకు 2500 రూపాయలు, నాలుగు వేల రూపాయలు పెన్షన్, దళితులకు అంబేద్కర్ అభయాసం కింద 12000 ఇవ్వాలని, నిరుద్యోగ భృతి, కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని బీజేపి నాయకులు డిమాండ్ చేసినారు, ఈ కార్య క్రమం లో బీజేపి మండల అధ్యక్షులు తీగుళ్ల సతీష్ రెడ్డి, బీజేపి సీనియర్ నాయకులు, మెడవేణి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శిలు, దేవి రాజలింగు, గోనె సాయి, ఉపాధ్యక్షులు, దేవి కొమరేష్, బీజేవైఎం మండల అధ్యక్షులు మామిడి చందు, మందపల్లి సాయిరాం, వార్డు సభ్యులు, బీజేపి నాయకులు నాడెం మల్లేశం, మల్యాల వెంకటేష్, కుంట రాజిరెడ్డి, వన్నెల బాల్ రెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, పాలమాకుల తిరుపతిరెడ్డి, సురకంటి తిరుపతి రెడ్డి, లడ్డు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల అక్రమ అరెస్టులు... పోలీస్ స్టేషన్ ముందు నిరసన

### అనుమతిచ్చి అరెస్టులు తగదు: సీఐటీయూ నిర్మల్ జిల్లా కమిటీ




నిర్మల్ మార్చి 16 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేయడం నిరసన హక్కును కాలరాయటమేననీ, అరెస్టయిన అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు సునీత వెంటనే విడుదల చేయాలని లిసీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెనసురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. ఆ నిరసన కార్యక్రమానికి పోలీసుల అనుమతి కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. కానీ పోలీసులు రాత్రికి రాత్రి ఎక్కడి వారిని అక్కడ అరెస్టులకు పాల్పడు తున్నారనీ, ఇది నిరసన తెలిపే హక్కును హరించటవేననీ, ఇలాంటి నిర్బంధ చర్యలను మానుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

**సమస్యలు పరిష్కరించమంటే అరెస్టులా?**

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని పలు సార్లు ప్రభుత్వానికి విన్నవించామనీ, అయినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటమే గాక, చలో హైదరాబాద్ కార్యక్రమానికి వస్తున్న అంగన్వాడీలను, నాయకత్వాన్ని అక్రమంగా అరెస్టు చేయటమేంటని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ప్రశ్నించింది. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. శైలజ, నాయకులు రమ్య లావణ్య ఉమా, తదితరులు పాల్గొన్నారు

# భవిత కేంద్రం, విద్యా సంస్థల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

**- ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆధునిక పరికరాలు, వసతుల ఏర్పాట్లు**

**- విద్యార్థులలో ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం పెరిగేలా పకడ్బందీగా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అమలు - జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**- 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు రీడింగ్ స్కిల్స్ పెంపుపై ప్రతిరోజు గంట సమయం తరగతులు**

**- కొణిజర్ల మండలంలోని భవిత కేంద్రం, చిన్న మునగాల లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం, మార్చి 16( ప్రజా కలం న్యూస్ )

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు (దివ్యాంగులైన) అన్ని రకాలుగా శిక్షణ, సహకారం అందించి సాధారణ పిల్లలకు సమానంగా తీర్చిదిద్దడమే భవిత కేంద్రం ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం వైరా నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. కొణిజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ గల భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా మెరుగైన మౌళిక సదుపాయాలతో రూపొందించిన పురోగతి పనులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. వాల్, పెయింటింగ్, బలహీనమైన పిల్లలకు ఫిజియోథెరపీ, వినికిడి, స్పీచ్ థెరపీ మిషనరీ, కృత్రిమ పరికరాలతో అక్కడ విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు మెరుగుపరచాలని, వివిధ బోధన ఉపకరణాలతో నాణ్యమైన విద్యను అందించి వారి మానసిక అభివృద్ధికి కృషి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కొణిజర్ల మండలం చిన్న మునగాల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు, మూడవ తరగతి గదులలో విద్యార్థులు ఇంగ్లీషు అక్షరాలు, పదాల ఉచ్చారణను కలెక్టర్ చదివించారు. అదే ప్రాగణంలో ఉన్న ఆంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు, గర్భిణి మహిళలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం, కోడిగుడ్లు అందించాలని సిబ్బందికి సూచించి, రికార్డు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యా విధానం ద్వారా దివ్యాంగులైన పిల్లలు మానసికంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. చిన్న వయసులోనే ఈ కేంద్రాల్లో చేర్పించడం ద్వారా తల్లిదండ్రుల అవసరం లేకుండా వారి పనులు వారే చేసుకునే స్థాయికి చేరుకుంటారని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ప్రభుత్వ అంధుల, బధిరుల పాఠశాల, భవిత కేంద్రాల్లోని దివ్యాంగులైన పిల్లల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్నామని, కావాలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆధునిక యంత్రాలు, వసతులతో వివిధ వైకల్యం కలిగిన శారీరకంగా బలహీనమైన వారికి ఫిజియోథెరపీ, మాటలు రాని వారికి స్పీచ్ థెరపి ఇప్పించడం, వినికిడి సక్రమంగా లేని పిల్లలకు వినికిడి పరికరాలు, ప్రత్యేకమైన బోధన ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. భవిత సెంటర్ లలో ప్రతిపాదించిన అభివృద్ధి పురోగతి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, దివ్యాంగ విద్యార్థులకు అనుకూలంగా భవిత సెంటర్లను తీర్చిదిద్దాలని తెలిపారు. అధికారులు అంగన్వాడీ, భవిత సెంటర్ ప్రభుత్వ అభివృద్ధి పనులు, భవనాలు, పాఠశాలల్లో కిచెన్ షెడ్, శౌచాలయాల నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. అదే విధంగా నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసే విధంగా గుత్తేదారులకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. శిథిలావస్థ లో ఉన్న అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాల భవనాలను గుర్తించి వాటి స్థానంలో నూతనంగా మంజూరైన భవనాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఏ విషయంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, పాఠశాల ఆదనపు తరగతి గదులు నిర్మాణాల ఏర్పాటులో జాప్యం చేయకూడదని ఇదివరకే అనుమతులు ఇచ్చిన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి విద్యార్థికి చదివే సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. విద్యా ప్రమాణాల పెంపుదలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. విద్యార్థులకు ముందుగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం అనే నైపుణ్యాలు రావడం చాలా కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ ప్రవీణ్ కుమార్, విద్యా శాఖ ఇఇ బుగ్గయ్య, కొణిజర్ల మండల విద్యాధికారి అబ్రహం, హెడ్ మాస్టర్ నాగమల్లేశ్వర రావు, ఏఈ సురేష్, సర్పంచ్ పూనాటి బాబురావు, ఉపాధ్యాయులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం డైరీ ఆవిష్కరణ

**- ఉపాధ్యాయుల రోజువారి అకాడమిక్ కార్యకలాపాలకు ఉపయోగపడే వినూత్న ప్రయత్నం - వరంగల్ డీఈవో రంగయ్య నాయుడు**

(వరంగల్/వర్ధన్నపేట) ప్రజాకలం ప్రతినిధి:

తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం రూపొందించిన డైరీని సోమవారం వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రంగయ్య నాయుడు ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు డీఈవోను కలిసి డైరీని ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా డీఈవో రంగయ్య నాయుడు మాట్లాడుతూ సబ్జెక్ట్ ఫోరం తరఫున డైరీని రూపొందించడం వినూత్న ప్రక్రియ అని అభినందించారు. డైరీలో అకాడమిక్ అంశాలను చేర్చి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల రోజువారి దినచర్యలో ఉపయోగపడే విధంగా రూపొందించడం ప్రశంసనీయమని తెలిపారు. అకాడమిక్ స్టాండర్డ్స్, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన ముఖ్య దినోత్సవాలు, టీచింగ్ డైరీ వంటి అంశాలతో ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా డైరీని రూపొందించారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు తాటిపాముల రమేష్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 200 మంది ఉపాధ్యాయులకు ఈ డైరీలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4,000 మంది సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఫోరం డైరీలను అందజేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేపల్లి రవి, జిల్లా గౌరవ అధ్యక్షుడు మంగ రాజన్న, జిల్లా కార్యదర్శులు చిట్టిపోతుల సంపత్, రాజనాల సురేష్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సృజన్ తేజ, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఆమంచ రవికుమార్, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, అన్న మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం మార్చి 24 లోపు ఎస్సీ యువతీ యువకులు స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు సమర్పించాలి

**- ఈడీ ఎస్సీ కార్పొరేషన్ నవీన్ బాబు**

ఖమ్మం, మార్చి 16(ప్రజా కలం న్యూస్ )

మార్చి 24 లోపు ఎస్సీ యువతీ, యువకులు స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు సమర్పించాలని ఈడీ ఎస్సీ కార్పోరేషన్ నవీన్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలను ఆమోదించి దరఖాస్తులు ఆహ్వానిస్తుందని అన్నారు. అర్హులైన షెడ్యూల్డ్ కులాలకు చెందిన యువతీ, యువకులు స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, వ్యవసాయేతర పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల వయస్సు, వ్యవసాయ పథకాలకు 21 నుంచి 60 సంవత్సరాల వయస్సు, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమానికి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు, వేతన ఉపాధి కార్యక్రమాలకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉండాలని తెలిపారు. గత 5 సంవత్సరాలలో ఎస్సీ కార్పొరేషన్ నుండి లబ్ధి పొందిన కుటుంబాల వారు అనర్హులు అవుతారని, అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు (గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలు) మించి ఉండకుండా ఉండాలని, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు) , పట్టాదారు పాసు పుస్తకం (సోలార్ పంప్ సెట్ కోసం కనీసం రెండు ఎకరాల భూమి ఉండాలని) దివ్యాంగ అభ్యర్థులు అయితే సదరం సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ తో అభ్యర్థులు తమ దరఖాస్తును నమోదు చేయాలని అన్నారు. నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులు మార్చి 24లోగా తమ దరఖాస్తులను https://tgobmms.cgg.gov.in ఆన్ లైన్ పోర్టల్ నమోదు చేయాలని, ఈ అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులు వినియోగించుకోవాలని ఈడీ ఎస్సీ కార్పోరేషన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎస్ వీ ఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో టెక్ స్ప్రింగ్ ఫెస్ట్ 2026 ఘనంగా ముగింపు



## ఉల్లాసంగా ఉత్సాహంగా ముగిసిన స్ప్రింగ్ స్ప్రేర్

హనుమకొండ మార్చి 16 ప్రజా కలం ప్రతినిధి

హనుమకొండ భీమవరంలోని ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన టెక్ స్ప్రింగ్ ఫెస్ట్ 2026 వేడుకలు ఎంతో ఉత్సాహ భరితంగా సోమవారం విజయవంతంగా ముగిసాయి. ఈ మూడు రోజుల ఉత్సవంలో మొత్తం 56 సాంకేతిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫెస్ట్ ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బోయినపల్లి ప్రతీక్, ఎమ్.డి.ప్రతిమ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ హాజరై విజేతలు రన్నర్‌అప్‌లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చైర్మన్ డాక్టర్ తిరుమల రావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు విద్యార్థులు చూపిన ప్రతిభ, సృజనాత్మకత క్రమశిక్షణను అభినందించారు.

ఇలాంటి సాంకేతిక ఉత్సవాలు విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా వైస్ చైర్‌పర్సన్ ఎర్రబెల్లి సువర్ణ, డాక్టర్ హర్షిణి ఎర్రబెల్లి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విజేతలు, రన్నర్ అప్‌లతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థిని కూడా ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి ఉత్సాహంతో పాల్గొనడం ఎంతో ప్రశంసనీయమని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యాపకులు, విద్యార్థులు నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలకు మండల స్థాయి ఎంపిక ప్రక్రియ పూర్తి

**- మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి**



( వరంగల్/ పర్వతగిరి ) మార్చి 16, ప్రజాకలం ప్రతినిధి.

తెలంగాణ రాష్ట్రంలో క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కొరకు మండల స్థాయి ఎంపిక ప్రక్రియ పూర్తయిందని పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి తెలిపారు. సోమవారం ఆర్డిఎఫ్ కల్లెడ పాఠశాలలో చేపట్టిన ఎంపిక ప్రక్రియకు పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఎం.బిక్షపతి, పర్వతగిరి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కే. నవీన్ కుమార్ లు ముఖ్య అతిథిలు గా పాల్గొని కార్యక్రమం ను ప్రారంభించారు. ఈ ఎంపికలో 11 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక అయ్యారని జిల్లా స్థాయిలో ఈనెల 28 నుండి ఏప్రిల్ 1 మధ్యన నిర్వహించబోయే పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి ఎంపికలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల ఫిజికల్ డైరెక్టర్లు పి. అనిల్, ఎం. వెంకటేశ్వర్లు, ఎం డి పాషా, విజయలక్ష్మి, సురేష్, రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణులను అవమానించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

**- తుంగతుర్తి, మానకొండూరు ఎమ్మెల్యేల వ్యాఖ్యలు అభ్యంతరకరం**

**-తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రాము డిమాండ్**



మార్చి 16 ప్రజాకలం ప్రతినిధి: (వరంగల్)

తుంగతుర్తి, మానకొండూరు నియోజకవర్గాల శాసనసభ్యులు చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూరి రాము డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి శాసనసభ్యులు సామెల్ బ్రాహ్మణులు చదివే వేద మంత్రాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా అభ్యంతరకరమన్నారు. బ్రాహ్మణులు చదివే వేద ఆశీర్వచన మంత్రాల అర్థం తనకు తెలియదని పరుషపదజాలంతో మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. అర్థం కాకపోతే అడిగి తెలుసుకోవాల్సిందిపోయి ఈ విధంగా వ్యాఖ్యానించడం బాధాకరమని తెలిపారు. అలాగే ఈ వ్యాఖ్యలను సమర్థిస్తూ మానకొండూరు శాసనసభ్యులు సత్యనారాయణ మొత్తం బ్రాహ్మణ సమాజాన్ని ఒక రాజకీయ పార్టీకి అనుసంధానించడం కూడా తగదని ఆయన విమర్శించారు. ఏ సమాజాన్నైనా రాజకీయాలకు కట్టిపడేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. కాబట్టి ఈ ఇద్దరు ఎమ్మెల్యేల వ్యాఖ్యలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మోత్కూరి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తాడిచెర్ల ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం

**- రోగులను పరిక్షించి మందులు పంపిణీ**



మల్హర్, మార్చి 16 ప్రజాకలం ప్రతినిధి మండల కేంద్రమైన తాడిచెర్ల లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో బాగంగా ప్రత్యేక స్పెషలిస్ట్ వైద్యులతో వైద్య సేవలను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో గైనిక్ ఓపి 35, పీడియాట్రిక్ ఓపి 21, జనరల్ ఓపి 95, ఆర్థోపెడిక్ 61,ఆప్తమాలజీ ఓపి 35, డెంటల్ –ఓపి 09 మొత్తం 256 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారులు డాక్టర్ వినయ్ భాస్కర్, డాక్టర్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యాధికారులతో పాటు ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

**రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి**

మల్హర్, మార్చి 16 ప్రజాకలం ప్రతినిధి మండలంలోని కొయ్యూర్ గ్రామంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు(నూజాజూర్రా) వైట్రిస్ ఫ్యామీ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. మహిళల సంక్షేమం కోసం ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కొయ్యురు సర్పంచ్ కొండ రాజమ్మ, ఉప సర్పంచ్ లకావత్ సవేందర్, ఎంఎస్ఎంఈ కౌన్సిలర్ రజిత. ఆలీప్ డిఆర్డీఏ సెర్ఫ్ సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఇఫ్తార్ విందు ల్లో పాల్గొన్న టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి మార్చి 16(ప్రజాకలం):

కొండాపూర్ మండలం మల్కా పూర్, సంగారెడ్డి మున్సిపాలిటీ పోతి రెడ్డిపల్లి 11,12 వార్డుల్లో జరిగిన ఇఫ్తార్ విందు లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి సోమవారం సంగారెడ్డి నియోజకవర్గం లో జరిగిన పలు ఇఫ్తార్ విందుల్లో టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. కొండాపూర్ మండలం మల్కా పూర్ లో జరిగిన ప్రభుత్వ ఇఫ్తార్ విందు లో నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మల్కా పూర్ సర్పంచ్ అనిల్, ఉప సర్పంచ్ ప్రవీణ్ లతో పాటు సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, నాయకులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని 11వ వార్డు మసీదు వద్ద మాజీ వార్డు కౌన్సిలర్ గడ్డం సరిత--తులసి రామ్ ఆధ్వర్యంలో దావత్--ఇ--ఇఫ్తార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ కార్యక్రమానికి స్థానిక ముస్లిం సోదరులు, ప్రజాప్రతినిధులు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఉపవాస విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిజిఐఐసి చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం సోదరభావం, సహనం, పరస్పర గౌరవం, సేవా భావాన్ని పెంపొందించే పవిత్ర కాలమని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సఖ్యతతో జీవించాలనే సందేశాన్ని రంజాన్ పండుగ ఇస్తుందని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ షఫీ, జైపాల్ రెడ్డి, స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, యువకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టం మార్పును సహించేది లేదు

## -ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

## -డిసిసి అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి

గజ్వేల్ నియోజకవర్గం:16 మార్చ్ 2026 (ప్రజా కలం ప్రతినిధి)

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని, ప్రజల హక్కులను తిరిగి కల్పించడంతోపాటు పంచాయతీల పాలనాధికారాన్ని పునరుద్ధరించాలని, వీ బీ జీ రామ్ జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి అన్నారు.గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలం తునికి ఖల్సా గ్రామంలో ఉపాధి హామీ లబ్ధిదారులతో సామూహిక సంప్రదింపు, సంతకాల సేకరణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొండగల్ల గణేష్ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా



వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల ఉపాధి హక్కును కాలరాస్తూ,గ్రామపంచాయతీలకు రాజ్యాంగబద్ధంగా లభించిన అధికారులను నిర్వీర్యం చేస్తోందని, కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమంలో మేము సైతం అంటూ గ్రామ గ్రామాన ఉపాధి హామీ కూలీలతో ముచ్చటించి వారికి మేము అండగా ఉంటామని తెలుపుతూ మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం మార్పును ఎట్టి పరిస్థితుల్లో మేము సహించేది లేదని అందుకు ఉపాధి కూలీలతో సంతకాల సేకరణ చేపట్టడం జరిగిందని మోడీ సర్కార్ మొండిగా వ్యవహరించి పేద ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా కార్యక్రమాలను తీసుకురావద్దని,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్దించాలని,వి బి జి రామ్ జి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని, డిమాండ్ చేశారు.ఉపాధి హక్కు పథకం వలన గతంలో ప్రజలు సంవత్సరానికి వంద రోజులు పని హక్కు ఉండేదని, కానీ ఇప్పుడు వి బి జి రామ్ చట్టం వలన కూలీల పని అవకాశాలు తగ్గి, తక్కువ వేతనాలకు పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగుమల్ల విజయలక్ష్మి,వార్డు సభ్యులు, ముత్త మహేష్,పెంటెం మౌనిక నరసింహులు,స్రవంతి భరత్ గౌడ్,వంక కుమార్, కొండగల నర్సింగరావు,రజిత శ్రీనివాస్,గుండె మైన మహేష్,నర్సగల సహదేవ్ మైలారం సహదేవ్,జొన్నాడ లక్ష్మి రాజు,కొండల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ సాయి గౌడ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.





# చెడు అలవాట్లు,వాహనాల చోరీ

## ఇద్దరి అరెస్ట్,మూడు వాహనాల స్వాధీనం

సికింద్రాబాద్:మార్చ్ 16: ప్రజాకలం ప్రతినిధి

ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాలను దొంగతనం చేస్తున్న ఇద్దరు నిందితులను పోలీస్ లు అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తన ద్విచక్ర వాహనం దొంగిలించబడినట్లు బాధితుడు చిరుమల్ల రాజ్ కుమార్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీస్ లు దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా అరోల్ల భరత్ (24), దామెర కార్తిక్ (22) అనే ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు అరోల్ల భరత్ సిద్ధిపేటకు చెందినవాడు కాగా ప్రస్తుతం హైదరాబాద్‌లోని తార్నాక ప్రాంతంలో నివసిస్తూ ఒక ప్రైవేట్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడని, మరో నిందితుడు దామెర కార్తిక్ నాచారం ప్రాంతానికి చెందినవాడిగా పోలీసులు తెలిపారు.

నిందితులు చెడు అలవాట్లకు బానిసలై సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇల్లు, షాపుల ముందు, రోడ్డు పక్కన పార్క్ చేసిన ద్విచక్ర వాహనాల తాళాలు విరగగొట్టి దొంగతనాలకు పాల్పడేవారని వెల్లడించారు. ఈ క్రమంలో వారు హీరో గ్లామర్, హోండా ఆక్టివా, హోండా డియో వంటి మూడు వాహనాలను దొంగిలించినట్లు గుర్తించారు. పోలీసులు నిందితుల వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

# నీటి బాటిల్‌కే రెట్టింపు రేట్లు...!?

## తూప్రాన్ బస్టాండ్‌లో ప్రయాణికుల దగ్గర దోపిడీ

మెదక్ మార్చి 16(ప్రజాకలం ప్రతినిధి)మెదక్ జిల్లా తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల జేబులు ఖాళీ చేస్తున్న నీటి బాటిళ్ల దందా ఆగే లక్షణాలు కనిపించడం లేదు. ఎంఆర్పీ ధరలు స్పష్టంగా ముద్రించబడినప్పటికీ వాటిని పట్టించుకోకుండా రెట్టింపు రేట్లకు బాటిళు అమ్ముతూ కొందరు వ్యాపారులు బహిరంగంగా దోపిడీ జరుగుతుంది. సాధారణంగా అర లీటర్ నీటి బాటిల్‌పై ఎంఆర్పీ ధర రూ.10 ఉండగా, అక్కడ మాత్రం నిరభ్యంతరంగా రూ.15 వసూలు చేస్తున్నారు. అలాగే ఒక లీటర్ బాటిల్‌పై ఎంఆర్పీ రూ.20 లేదా రూ.25 ఉండగా, దానిని కూడా అధిక ధరలకు విక్రయిస్తూ ప్రయాణికులను మోసం చేస్తున్నారు.

దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, మహిళలు, వృద్ధులు బస్టాండ్‌లో తప్పనిసరిగా నీటి బాటిళ్లు కొనాల్సిన పరిస్థితి ఉండటంతో, ఈ పరిస్థితిని కొందరు దుకాణదారులు అవకాశంగా మార్చుకున్నారు. ఎంఆర్పీ కంటే ఎక్కువ ధర వసూలు చేయడం చట్ట విరుద్ధమనే విషయం తెలిసినా, ఎవరూ పట్టించుకోవడం లేదనే ధైర్యంతో దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ఈ విషయంపై గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్‌ను వివరణ కోరగా, ప్రయాణికుల సమస్యను పట్టించుకునే బదులు దుకాణదారులకు మద్దతుగా మాట్లాడటం మరింత ఆశ్చర్యానికి గురి చేస్తోంది. అధికారులే ఇలా వ్యవహరిస్తే సాధారణ





ప్రజలకు న్యాయం ఎక్కడ దొరుకుతుందన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం ప్రయాణికుల సౌకర్యాల కోసం బస్టాండ్లను ఏర్పాటు చేస్తే, అక్కడే కొందరు వ్యాపారులు అధిక ధరలతో ప్రజలను నిలువునా దోచుకోవడం బాధాకరం. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ అక్రమాలు బహిరంగంగానే సాగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మెదక్ జిల్లా అధికారులు స్పందించి తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఎంఆర్పీ కంటే ఎక్కువ ధరలకు నీటి బాటిళ్లు అమ్ముతున్న దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే బాధ్యతల్ని విస్మరించిన సంబంధిత అధికారులపై కూడా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఇలాంటి దోపిడీలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాన్ని అడ్డుకోండి

## జోనల్ కమిషనర్ కు వినతి



మల్కాజిగిరి,మార్చ్16 (ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి డివిజన్ విమలాదేవి నగర్ లోని గ్రామపంచాయతీ లేఅవుట్ స్థలంలో బావిగా ఉన్న ప్రాంతాన్ని దాదాపు 15 సంవత్సరాల క్రితం నిర్మించబడిన హౌస్ నెంబర్ 24-144 తో ఉన్న శ్రీ వెంకటేశ్వర అపార్ట్మెంట్ అదే హౌస్ నెంబర్ తో కొందరు వ్యక్తులు భావి స్థలాన్ని అక్రమంగా తప్పుడు దువపత్రాలను చూపించి రోడ్డు విస్తీర్ణలను హద్దులను కూడా తప్పుడుగా చూపిస్తూ తయారు చేసుకున్న పత్రాలతో తెలంగాణ బి పాస్ ఆన్లైన్లో పర్మిషన్లను పొంది నిర్మిస్తున్న నిర్మాణాన్ని జిహెచ్ఎంసి అధికారులు నిలిపివేయాలని కోరుతూ సోమవారం మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ను వారి కార్యాలయంలో కలిసి విమలాదేవి నగర్ కాలనీవాసులు మెమోరండాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ తప్పుడు దువపత్రాలతో కాలనీ లే అవుట్ లో బావి, పార్కు,స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని దొంగ పత్రాలను శ్రీ లక్ష్మీ డెవలపర్స్ అనే సంస్థ వారు సృష్టించి మెట్టు భావిపై నిర్మాణం చేయడం జరుగుతుందని దీని ద్వారా స్థానికంగా వందలాది కుటుంబాలకు ఈ నిర్మాణం చేపడితే ప్రమాదంగా మారిందని, దీనిని అడ్డుకోవాలని గతంలో జిహెచ్ఎంసి అధికారులకు విజ్ఞాపన పత్రాలను అందించామని వారి దృష్టికి తీసుకువెళ్లామని అయినా సరైన న్యాయం జరగటం లేదన్నారు.సెట్ బ్యాక్ లు లేకుండా రోడ్డు విస్తీర్ణంలో అవకతవకలను చూపించి సెల్లార్ తవడంతో చుట్టుపక్కల ఉన్నటువంటి కట్టడాలు ప్రమాదంలో పడుతున్నాయని,పక్కనే ఉన్న అపార్ట్మెంట్ అసోసియేషన్ నుంచి ఎన్ఓసి లేనందున,తప్పుడు దువపత్రాలతో నిర్మాణానికి అనుమతులు పొందిన ఈ నిర్మాణాన్ని వెంటనే రద్దు చేయాలని మెమోరండం అందించడం జరిగిందని చెప్పారు.ఈ అంశంపై జోనల్ కమిషనర్ విచారణ చేపట్టి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శివకుమార్, ఎం రాజు,ఏ సునీల్,జ్యోతి ఎయం విగ్నేష్,ఎన్ సాయికుమార్,జి వెంకటేష్,కే శ్రీనివాస్,ఇతర కాలనీ నివాసితులు తదితరులు పాల్గొన్నారు.



# అపర్ణ సైబర్ కమ్యూన్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

## మహిళా సాధకులకు సత్కారం.. స్ఫూర్తిదాయకంగా వేడుకలు

హైదరాబాద్, మార్చి 16 (ప్రజా కలం ప్రతినిధి)

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని, ప్రతి రంగంలోనూ వారు తమ సత్తా చాటుతున్నారని ప్రముఖులు కొనియాడారు. నల్లగండ్లలోని అపర్ణ సైబర్ కమ్యూన్ గెటెడ్ కమ్యూనిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. టీమ్ ఏక్తా మే శక్తి, అపర్ణ సైబర్ కమ్యూన్ మేనేజింగ్ కమిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మహిళా సాధకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అపోలో ఎంటర్‌ప్రైజ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి, తెలంగాణ మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా సుధాకర్ గండే, రష్మి నాయక్, నమితా ప్రసాద్ హాజరయ్యారు. ఈ వేడుకల్లోటీమ్ ఏక్తా మే శక్తి వ్యవస్థాపక సభ్యులు ప్రబీన్ బర్ధన్, వినితా సింగ్, స్నిగ్ధ ద్వివేది నేతృత్వంలో జరిగిన ఈ వేడుకకు అపర్ణ సైబర్ కమ్యూన్ ఎంసీ సభ్యులు ఆకాష్ అగర్వాల్, ఏసీఎన్ నారాయణ, ప్రమోద్ అగర్వాల్, మెహుల్ వోరా తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపార సముదాయాల్లో, గృహ వినియోగ సిలెండర్లు

## సివిల్ సప్లైస్ అధికారుల దాడులు, 18 సిలెండర్లు స్వాధీనం

సికింద్రాబాద్: మార్చ్ 16: ప్రజా కలం ప్రతినిధి

సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో గృహ వినియోగానికి వాడే ఎల్పీజీ సిలిండర్లను వ్యాపార దుకాణాల్లో ఉపయోగిస్తున్న వారిపై





అధికారులు దాడులు నిర్వహించారు. గ్యాస్ ధర పెరగడంతో అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. వారు చేపట్టిన తనికీల్లో మొత్తం 18 గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. రెజిమెంటల్ బజార్, తార్నాక,మెట్టుగూడ, వారాసిగూడ తదితర ప్రాంతాల్లో ఈ దాడులు నిర్వహించి నట్లు స్పష్టం చేశారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు.ఈ దాడులను సికింద్రాబాద్ అసిస్టెంట్ సివిల్ సప్లైస్ ఆఫీసర్ జి.వి. చాముండేశ్వరి ఆధ్వర్యంలో డీటీలు ఉత్తేజ్ సాగర్, అభిషేక్, శ్రీనివాస్, అరుణతో పాటు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. అక్రమంగా గ్యాస్ సిలిండర్లను వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని అధికారులు హెచ్చరించారు. అలాగే గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించవద్దని సూచించారు.

# మృతి చెందిన ఉద్యమకారుడి కుటుంబాన్ని ఆదుకుంటాం...

## మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

గజ్వేల్ నియోజకవర్గం:16 మార్చ్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

ఉద్యమకారుడు,ప్రజా గాయకుడు గిరిపల్లి గ్రామానికి చెందిన నేశీటూరి



మల్లేశం అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా,సోమవారం బాధిత కుటుంబ సభ్యులను గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పరామర్శించారు.ఈ సందర్భంగా మల్లేశం మృతి పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా వారికి ఆయన ఆర్థిక సహాయం అందించగా, ఆయన వెంట గ్రామ సర్పంచ్ పోసాని రమేష్,నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, యాదగిరి,నరేష్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల నర్సింహా రెడ్డి

మహేశ్వరం, మార్చ్ 16,(ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్ల నర్సింహా రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో



ప్రజాసమస్యలపైన కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క గారు ఆదిలాబాద్ నుండి ఖమ్మం వరకు చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామం మర్చి16 నుండి ఖమ్మం జిల్లా ఖమ్మం నియోజకవర్గం ఖమ్మం అర్బన్ మండలం గోపాలపురం గ్రామం ముగింపుసభ జులై 02/07/2023, వరకు పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గారితో కలిసి అడుగులో అడుగులు వేస్తూ, నడుచుకుంటూ సుదీర్ఘంగా 4నెలలు పాటు మండుటెండలలో,చలిలో, వర్షంలో,109 రోజులు,17జిల్లాలు 36 నియోజకవర్గాలు, 750పైగా గ్రామాలు,1364 కిలోమీటర్లు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర , మూడుసంవత్సరాలు పూర్తిఅయిన సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చల్ల బాల్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ గౌడ్. హనుమాన్ దేవాలయం డైరెక్టర్ సంతోష్, కాంగ్రెస్ నాయకులు శేఖర్ రెడ్డి, పరషారామ్,విజయ్ వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## పరిశుభ్రతను పెంపొందించడం, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

### గుర్రం గూడ ఏరియా పరిధిలో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌ను పరిశీలించిన ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, మార్చ్ 16,(ప్రజా కలం)

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో పట్టణాలను పరిశుభ్రంగా, ప్రజలకు అనుకూలంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా ఈరోజు బడంగ్‌పేట్ పరిధిలోని




వార్డ్–57లో, అల్మాస్‌గూడ నుండి గుర్రం గూడ ఏరియా పరిధిలో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌ను ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశం పట్టణంలో పరిశుభ్రతను పెంపొందించడం, ప్రజలకు మెరుగైన పౌర సౌకర్యాలు అందించడం మరియు కాలనీల్లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరించడం. బహిరంగ మల విసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆధునిక సౌకర్యాలతో కూడిన పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయడం, అలాగే కాలనీల్లో డ్రైనేజీ, రోడ్లు మరియు పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరస్వతి, డి. ఈ వెంకన్న తో పాటు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే స్థానిక నాయకులు దిండు శ్రీనివాస్ గౌడ్, తిరుపతయ్య, నార్సింగ్, సోమయ్య, యాదయ్య, లక్ష్మణ్, రఘు, వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## భూములు కోల్పోతున్న నిర్వాసితులను ఆదుకుంటాం - జిల్లా కలెక్టర్ హైమావతి

గజ్వేల్: 16 మార్చి 2026 (ప్రజా కలం ప్రతినిధి)

రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న బాధిత రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అయితే భూ సేకరణకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. సోమవారం గజ్వేల్ సమీకృత కార్యాలయ సముదాయశీలో రీజనల్ రింగ్ రోడ్డు వలన భూమి కోల్పోతున్న చెబర్తి, అల్రాజీపేట,పిర్లపల్లి,ఇటిక్యాల గ్రామాల రైతులతో ఆర్బిటరేషన్ ప్రక్రియ గూర్చి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజనల్ రింగ్ రోడ్డు వెళ్తున్నందున ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి రైతులు ఒప్పుకోవడం శుభపరిణామమని అన్నారు. ప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న మీకు ప్రభుత్వ తరపున దక్కాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చూస్తామని, భూమిని త్వరగా అందించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం అందరికీ ఆమోద యోగ్యమైన పరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ,తహసిల్దార్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి.

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి.

సిద్దిపేట జిల్లా మార్చి 16. ప్రజాకలం ప్రతినిధి

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమస్యల పరిష్కారం కోసం నమ్మకంతో ప్రజావాణికి వస్తారని, అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 217 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఏఓ రాజ్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ విగ్రహ... గద్దె కూల్చడం దురదృష్టకరం

**- యువతపై నమోదు చేసిన కేసులు వెంటనే ఎత్తివేయాలి**

**-అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇవ్వాలి**

**-జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు:కొట్టాల యాదగిరి ముదిరాజ్**

గజ్వేల్ నియోజకవర్గం:16 మార్చ్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అందరివాడని, ఆయన విగ్రహ ఏర్పాటుతో ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉండదని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు,లీగల్ సెల్ నేత కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు.

గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలం నాచారం వద్ద అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దె కూల్చిన ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అట్టడుగున నిలిచిన ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ,బిసి వర్గాల అభ్యున్నతికి కృషి చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా చిన్న రాష్ట్రాల ఏర్పాటుతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని స్పష్టం చేయగా,అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినట్లు చెప్పారు. అయితే అందరి ఆరాధ్యదైవమైన అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యంగా గద్దె నిర్మాణ నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేయడం భావ్యం కాదని పేర్కొంటూ రహదారికి సమీపంలో విగ్రహ ఏర్పాటును స్వాగతిస్తూ సంబంధిత అధికారులు అనుమతి ఇవ్వాలని కోరారు. సున్నితమైన ఇలాంటి అంశాన్ని ఏకపక్ష నిర్ణయాలతో పరిష్కరించలేరని, అన్ని వర్గాలతో చర్చించి వెంటనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు త్వరితగతిన స్పందించి చర్యలు చేపట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండుగళ్ల కిషన్,జిల్లా అధ్యక్షులు ముకద్దశీ సుధాకర్,నాచారం అంబేద్కర్ సంఘం అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు వేతనాలు వెంటనే పెంచాలి

### సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్: 16 మార్చి 2026 (ప్రజా కలం ప్రతినిధి )

పెరుగుతున్న ఖర్చులు గృహ అవసరాల కనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు పెంచి అమలు చేయాలని సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ లకు వేతనాలు పెంచాలని వినతి పత్రం అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా వేతనాలు పెరగడం లేదని,ఈ కాలంలో అనేక రెట్ల నిత్యవసర సరుకులు ధరలు,రోజువారీ ఖర్చులు పెరిగాయని ప్రస్తుతం వస్తున్న జీతాలతో కుటుంబాలు గడవడం లేదని, అప్పులు చేసే జీవనం కొనసాగించాల్సి వస్తుందని అన్నారు. సంవత్సరాల తరబడి కాంట్రాక్టు,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, రోజువారి కార్మికులుగా పనిచేయడం జరుగుతుంది అని కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 40 మంది కార్మికులకు గత ఐదు నెలల జీతాలు అందలేదని, మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న ముంపు గ్రామాల కార్మికులకు మున్సిపల్ జీవో అమలు జరిపి వేతనాలు పెంచాలని



కోరారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్ చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మరియు మున్సిపల్ యూనియన్ నాయకులు సంగపురం యాదగిరి, బచ్చలి కుమార్, నర్సింలు స్వామి సంతోష్ కుమార్ బాలయ్య మల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# హామీని నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం,

### అసెంబ్లీలో నిలదీస్తామన్న కేటీఆర్

### తెలంగాణ భవన్ లో ఘనంగా ఇఫ్తార్



హైదరాబాద్, మార్చి 16 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ భవన్, బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఘనంగా నిర్వహించిన దావత్–ఏ–ఇఫ్తార్ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ సోదర సోదరీమణులందరికి పవిత్ర రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని మైనారిటీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మైనారిటీల సంక్షేమం కోసం ప్రకటించిన డిక్లరేషన్‌ను అమలు చేయకుండా వారిని మోసం చేశారన్నారు. తెలంగాణ శాసనసభ సమావేశాల్లో, మైనారిటీ వర్గాలను కాంగ్రెస్ ఏ విధంగా వంచించిందో సాక్ష్యాధారాలతో సహా ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు. అపరిష్కృతంగా ఉన్న ప్రతి హామీ పైన ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని భరోసా ఇచ్చారు. కేసీఆర్ పది ఏళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం కుల మతాలకు అతీతంగా, గంగా–జమునా తెహజీబ్ సంస్కృతితో అద్భుతంగా ముందుకు సాగిందని కేటీఆర్ గుర్తు చేశారు. గత ప్రభుత్వం ప్రతి ఒక్కరిని సమానంగా చూస్తూ మత సామరస్యానికి పెద్దపీట వేసిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ ఆశయాలను పక్కన పెట్టడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో మైనారిటీ సోదరులు పాల్గొని ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.






## మహేశ్వరం అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం పై నిరసన

### డీజిల్ పెట్రోల్ ధరలను కూడా అదుపులో ఉంచాలని

### సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్నాటి యాదయ్య

మహేశ్వరం, మార్చ్ 16,(ప్రజా కలం)

మహేశ్వరం అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం పై నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్నాటి యాదయ్య అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మహేశ్వరం మండలం అంబేద్కర్ చౌరస్తాలో మార్చ్ 16వ తేదీన నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్నాటి యాదయ్య మాట్లాడుతూ యుద్ధోన్మాదం నశించాలని గ్యాస్ కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. డీజిల్ పెట్రోల్ ధరలను కూడా అదుపులో ఉంచాలని కోరారు. డీజిల్, పెట్రోల్,గ్యాస్ ధరలు పెరగడం వలన అనేక నిత్యవసర వస్తువుల ధరలు కూడా పెరగడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. గ్యాస్ ధరలు ఇప్పటికే 130 రూపాయలు పెరగడం వలన అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలియజేశారు. ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధానికి అమెరికా సహకరించడం మంచి పరిణామం కాదని దేశం అభివృద్ధి చెందాలంటే యుద్ధాలు తక్షణమే ఆపవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. రాష్ట్రంలో రైతులు రైతుబంధు రాక యూరియా దొరకక అనేక అవస్థలు పడుతున్నారని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు ఇస్తదా ఇవ్వదా అని స్పష్టంగా రైతులకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఇదే మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తే సిపిఐ పార్టీ చూస్తూ ఊరుకోదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బ్రహ్మచారి, బి రామచంద్రయ్య, నర్సింహా, జంగయ్య, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ విధానం అవలంబించడంలో కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని విడాలి

### సిపిఐ బాలాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కు వినతిపత్రం

### సిపిఐ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం, మార్చి 16, (ప్రజా కలం)

ఇరాన్ ఇజ్రాయిల్ అమెరికా దేశాల మధ్య నెలకొన్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని యుద్ధాల వలన ఏర్పడిన సంక్షోభాన్ని నిలువరించడానికి కేంద్ర ప్రభుత్వం విదేశీ విధానాన్ని జోక్యం చేసుకొని భారత దేశంలో ప్రజలను భయాందోళను తొలగించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇరాన్ ఇజ్రాయిల్ అమెరికా దేశాల మధ్య నెలకొన్న యుద్ధం నాని మూలంగా ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు సంక్షోభంలో మునిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు భారతదేశంలో గ్యాస్ పెట్రోలియం ఉత్పత్తులు సరఫరా ఆగిపోవడంతో గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యులు బ్లాక్ మార్కెట్ దందాలు మొదలు పెట్టారని అన్నారు.

వంటగ్యాస్ విషయంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 60 రూపాయలు పెంచి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని మోపారని అన్నారు. ఇరాన్ ఇజ్రాయిల్ అమెరికా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని సరైన విదేశీ విధానాన్ని అవలంబిస్తూ సంక్షోభం నుండి కాపాడాలని అన్నారు. సిపిఐ బాలాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి జె రెడ్యానాయక్, సీనియర్ నాయకులు పిచ్చి రాజు, చత్రు నాయక్, వీరాస్వామి, పాండు నాయక్, శ్రీనునాయక్, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల 8500 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

**- రాష్ట్రంలోని విద్యారంగానికి కనీసం 15% బడ్జెట్ కేటాయించాలి**

**- విద్యారంగం సమస్యలపై వెంటనే రాష్ట్రం స్పందించాలి**

**- ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డిల్లీ భాను ప్రసాద్**

మహేశ్వరం, మార్చ్ 16, (ప్రజా కలం)

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కందుకూరు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డిల్లీ భాను ప్రసాద్ మాట్లాడుతు విద్యార్థుల సమస్యలపై ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. రాబోయే మార్చి 20న ప్రారంభమయ్యే అసెంబ్లీ




సమావేశాల్లో విద్యారంగానికి కనీసం 15 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక రాష్ట్ర అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యను బలోపేతం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు.రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యాశాఖకు ఇప్పటివరకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగకపోవడం వల్ల విద్యారంగానికి సంబంధించిన అనేక కీలక నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. అందువల్ల వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.ఇంకా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం కావడం వల్ల అనేక మంది విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువు కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.కొన్ని సందర్భాల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఇది విద్యార్థుల భవిష్యత్తుకు ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న అన్ని స్కాలర్షిప్లు మరియు ఫీజు రీయింబర్స్మెంట్లను విడుదల చేయడంతో పాటు విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో విద్యార్థి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో కందుకూరు నగర కార్యదర్శి గంగవరం వినయ్, స్పోర్ట్స్ కన్వీనర్ మణి,డిల్లీ జశ్వంత్, పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గా కొలిమి శివ ప్రసాద్

మహేశ్వరం, మార్చ్ 16,(ప్రజా కలం)

తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గా కొలిమి శివ ప్రసాద్ తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా కార్యదర్శి గా నియమకం జరిగింది.తెలంగాణ ఉ ద్యమ కారుల ఫోరమ్ ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా కార్యదర్శి గా కొలిమి శివ ప్రసాద్ ని నియమిస్తూ ప్రకటిస్తున్నాం తెలంగాణ ఉద్యమ కారుల ను ఐక్యం చేస్తూ తెలంగాణ పునర్ నిర్మాణం కోసం పని చేయాలని కోరుతున్నాం.చీమ శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్రం చైర్మన్ మాట్లాడుతూ గతం లో చేవెళ్ల మండల్ లో యూత్ లీడర్ గా పని చేసిన కొలిమి శివప్రసాద్ మంచి పేరు తెచ్చుకున్నారని భవిష్యత్తులో ఇంకా మరిన్ని కార్యక్రమం లో చురుకుగా పాల్గొనలని తెలిపారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ యాలాల మహేశ్వర్ రెడ్డి చైర్మన్ ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా,చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ తదితరులు పాల్గొన్నారు.




# మహేశ్వరంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగించాలి

**జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కి వినతిపత్రం అందజేసిన మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ మహేశ్వరం వివిధ గ్రామాల సర్పంచ్లు**



మహేశ్వరం, మార్చ్ 16, (ప్రజా కలం) రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మండల కేంద్రం అయిన మహేశ్వరం గ్రామ పరిధిలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించాలనే ఊహాగానాలపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మహేశ్వరం, శంషాబాద్ ఇబ్రాహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కలిపి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా ఏర్పాటు చేసి, జిహెచ్ఎంసి పరిధిలోని మంఖాల్ రెవెన్యూ ప్రాంతంలో నిర్మించనున్నట్లు పత్రికలలో వార్తలు వస్తుండటంతో మహేశ్వరం మండల ప్రజలు దీనికి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.మహేశ్వరం గ్రామం 1995 సంవత్సరంనుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కేంద్రంగా కొనసాగుతూ, నియోజకవర్గ ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలను సులభతరం చేస్తోంది. ఈ కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి కూడా అధిక మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. ఇటీవల మహేశ్వరం ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతూ ఉ ండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగి, రిజిస్ట్రేషన్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అదేవిధంగా మహేశ్వరం ప్రాంతం కందుకూరు, కడ్తాల్, ఆమంగల్ ప్రాంతాలకు మధ్యస్థంగా ఉండటంతో ఆ ప్రాంతాల ప్రజలు కూడా ఇక్కడే సులభంగా రిజిస్ట్రేషన్లు నిర్వహించుకుంటున్నారు. ఒకవేళ ఈ కార్యాలయాన్ని జిహెచ్ఎంసి పరిధిలోకి తరలిస్తే ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు, సమయం ఇతర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో మహేశ్వరం మండల ప్రజలు తమ వినతిని రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ అధికారులకు తెలియజేశారు. అనంతరం అధికారులు మహేశ్వరం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 71లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా ఆర్ డి ఓ కూడా ఆ ప్రదేశాన్ని సందర్శించి సర్వే నిర్వహించినట్లు తెలిసింది. మహేశ్వరం మండల కేంద్రంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కొనసాగించాలని మహేశ్వరం మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్ ఆధ్వర్యంలో మహేశ్వరం మండల సర్పంచులంతా కలిసి కలెక్టర్ కి వినతి పత్రం ఇయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవుళ్ళ నాయక్, పద్మ కృష్ణ , జగదీష్, శంకరయ్య, జ్యోతి కుమార్ నాయక్, జయమ్మ కృష్ణ , పోతుళ్ళ మల్లమ్మ , క్రిష్ణవేణి శ్రీనివాస్,మొతిలాల్ జ్యోతి సిల్వారెడ్డి, లక్ష్మమ్మ,చంద్రయ్య, అంబయ్య, పాండు యదవ్, వెంకటవీర్ రెడ్డి, చంద్రశంకర్ రెడ్డి జోమల రమేష్, హనుమంతు, రాజు నాయక్ , రవి,దుడ్డి కృష్ణ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## కోలన్ శంకర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన బాలాపూర్ సాయినగర్ మల్లాపూర్ బిజెపి నాయకులు

మహేశ్వరం, మార్చ్ 16,(ప్రజా కలం)

బిజెపి రాష్ట్ర కోఆపరేటివ్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు గా కోలన్ శంకర్ రెడ్డి నియమించడం పట్ల బాలాపూర్ సాయినగర్ మల్లాపూర్ బిజెపి నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పోరాటాల ముద్దుబిడ్డ 39 సం లు గా ఒకటే పార్టీ లో ఉంటూ హిందుత్వ నాయకులు కోలన్ శంకర్ రెడ్డి ని నియమించిన సందర్భంగా బాలాపూర్, సాయినగర్, మల్లాపూర్ బిజెపి శ్రేణులు శాలువాలు , పూల మాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.




## ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలి

**- భారత ప్రభుత్వం తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలి**

**- సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు డిమాండ్**

మహేశ్వరం, మార్చ్ 16,(ప్రజా కలం)

ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం వల్ల దేశంలో పెట్రో గ్యాస్ కొరత ఏర్పడి ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారని తక్షణమే యుద్ధాన్ని ఆపాలని దేనికి భారత ప్రభుత్వం చొరవ చూపాలని సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు.యుద్ధం వద్దు ప్రపంచశాంతి ముద్దు ఇరాన్ పై యుద్ధోన్మాదని తక్షణమే ఆపాలని గ్యాస్ పెట్రో కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ శంషాబాద్ మండల కేంద్రంలో వంట గ్యాస్ పొయ్యి పట్టుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసన ధర్నాసిపిఐ మండల కార్యదర్శి నర్ర గిరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు గల్ఫ్ దేశాలలో ఆయిల్ నిక్షేపాలపై కన్ను వేసిన అమెరికా ఎలాగైనా అక్కడ ఉన్న ప్రభుత్వాలను కూల్చి తమకు అనుకూలమైన ప్రభుత్వాలను తెచ్చుకోవడానికి మాట వినని ఇరాక్ పైన దాడి చేసి ఆ దేశ సుప్రీమును హతమార్చడం దుర్మార్గమని ఆయన విమర్శించారు. ఇరాన్ పై యుద్ధం వల్ల భారతదేశంలో తీవ్రమైన గ్యాస్ కొరత పెట్రో ఇంధనం కొరత ఏర్పడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని ఇది భారత ప్రధానికి కనబడడం లేదా అని ఆయన ప్రశ్నించారు. యుద్ధం ఇదే విధంగా కొనసాగితే రాబోయే కాలంలో గ్యాస్ ఇంధనం కొరతతో పాటు ఆహార ధాన్యాల కొరత కూడా ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. అమెరికా ఆధిపత్యం కోసం జరిగే యుద్ధాలు ప్రపంచ ప్రజలకు నష్టం కలిగిస్తున్నాయని అమెరికా ధన దాహానికి పేద దేశాలు నలిగిపోతున్నాయని ఆయన ఆవేదన చెందారు . అమెరికా యుధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని భారత ప్రభుత్వం తటస్థ వైఖరి విడనాడి తన స్నేహితుడైన ట్రంప్ ను ప్రశ్నించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ యాదగిరి, శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి, ఏఐటియుసి మండల కార్యదర్శి గిలక రాజు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు శ్రీను, ఏఐటియుసి నాయకుడు ప్రవీణ్ కుమార్ గౌడ్, నరేష్ నాయక్ ఇతర కార్మికులు ప్రజలు పాల్గొన్నారు.

# గవర్నర్ ప్రసంగం అంతా 'గాలిలో మేడలే'

**క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరు**

**బతుకమ్మ లేని తెలంగాణ తల్లి.. ఆత్మ లేని దేహం!**

**ఉద్యమ చరిత్రను చెరిపేసేందుకే రేవంత్ సర్కార్ కుట్ర**

**తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి**



మహేశ్వరం, మార్చ్ 16,(ప్రజా కలం)

తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించిన బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహం ఎంత మాత్రమూ తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం కాదు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితమ్మ తెలిపనట్టుగా బతుకమ్మ సమస్త తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్ర నిర్మాణంలో పాల్గొనని వారు మొదట చేయాలనుకునే పని చరిత్రను చెరిపేయాలని చూడడం. కుదరకపోతే వక్రీకరించాలని చూడడం. ఇప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న పనులు ఇవే. నేడు తెలంగాణలో నూటికి 90 మందికి రేవంత్ రెడ్డి కన్నా గొప్ప తెలంగాణ ఉద్యమ నేపథ్యం ఉన్నది. తనకు స్థానం లేని ఉద్యమ చరిత్రను రూపుమాపాలి అనే అల్పసంతోషం తప్ప ఇది మరొకటి కాదు.తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా గారు చేసిన ప్రసంగం పట్ల తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరిగిందని జాగృతి నాయకుడు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులకు విడుదల చేసిన ప్రకటన

?ప్రసంగంలోని డొల్లతనం – పచ్చి నిజాలు:

?2047 లక్ష్యం.. నేటి సంక్షోభం ఎవరికి కావాలి?: 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని కలలు చూపిస్తున్న ప్రభుత్వం, ప్రస్తుతం అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని ఎలా గట్టెక్కిస్తుందో చెప్పడం లేదు. భవిష్యత్తు గురించి ఊహాచిత్రాలు గీస్తూ, నేటి నిరుద్యోగతను, ఆర్థిక ఇబ్బందులను గాలికొదిలేశారు.?జీహెచ్ఎంసీ విభజన – పరిపాలనా సౌలభ్యమా? రాజకీయ స్వార్థమా?: హైదరాబాద్ నగరాన్ని విస్తరిస్తూ జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేయడం వెనుక గల అసలు ఉద్దేశం రాజకీయ ఆధిపత్యమే తప్ప ప్రజల సౌకర్యం కాదు. దీనివల్ల సామాన్యుడికి ఒరిగేదేమీ లేదు, కేవలం అధికారుల సంఖ్య, ఖర్చు పెరుగుతుంది.

?మూసీ ప్రక్షాళన – పేదల వెలివేత: మూసీ నది ప్రక్షాళన పేరుతో వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారు కానీ, దాని వల్ల నిరాశ్రయులవుతున్న వేలాది పేద కుటుంబాల పరిస్థితి ఏంటి? హిమాయత్‌సాగర్ నుంచి గాంధీసరోవర్ వరకు అభివృద్ధి అంటే.. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారమా? ఇక ?రైతు భరోసా – క్షేత్రస్థాయిలో అన్యాయం: 9 రోజుల్లో రూ.9వేల కోట్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఇంకా ఎంతమంది కౌలు రైతులు, సామాన్య రైతులు సాయం అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారో పట్టించుకోవడం లేదు. 'రేర్' నమూనా పేరుతో వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోంది.

?ఇందిరమ్మ ఇళ్లు – ఆచరణ సాధ్యమేనా?: 4 లక్షల ఇళ్ల నిర్మాణం అని చెబుతున్న ప్రభుత్వం, గతంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్లకు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదు? కొత్త ఇళ్ల మంజూరు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదు.?బుల్లెట్ రైళ్లు, విమానాశ్రయాలు – సామాన్యుడికి దూరం: వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల ముచ్చట దశాబ్దాలుగా వింటున్నదే. ఇవన్నీ ఎన్నికల తాయిలాలుగానే కనిపిస్తున్నాయి తప్ప, సామాన్యుడి రవాణా కష్టాలను తీర్చేవి కావు.

?"ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రజాపాలన' కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితమైంది. పరిష్కారం చూపని 47 వేల పిటిషన్ల గణాంకాలు దేనికి సంకేతం? ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసే విధంగా ఈ ప్రసంగం ఉంది. 'జాగృతి' తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి, ఈ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటుంది. అని పాండురంగారెడ్డి అన్నారు.

# బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

**- డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ ఆకస్మిక తనిఖీలు**

**- అధికారులకు అందుబాటులో లేని బడంగ్ పేట టౌన్ ప్లానింగ్ ఏసీపీ**


**- జీహెచ్ఎంసీలో విలీనం అయిన తరువాత కూడా నకిలీ బిల్లుల**

**- ఏసీబీ హైదరాబాద్ రేంజ్--2 డీఎస్పీ గంగసాని శ్రీధర్**



మహేశ్వరం, మార్చ్ 16, (ప్రజా కలం)

అవినీతి ఆరోపణల నేపథ్యంలో జీహెచ్ఎంసీ శంషాబాద్ జోన్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో అవినీతి




నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు.ఏసీబీ హైదరాబాద్ రేంజ్--2 డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.సోదాల్లో భాగంగా శానిటేషన్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన ఫైళ్లు, బిల్లులను అధికారులు పరిశీలిస్తున్నారు. గతంలో మున్సిపల్ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో కొన్ని పనులు చేయకపోయినా చేసినట్లు చూపించి బిల్లులు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు.జీహెచ్ఎంసీలో విలీనం అయిన తరువాత కూడా నకిలీ బిల్లుల ద్వారా నిధులు పొందేందుకు ప్రయత్నాలు జరిగాయని ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్, శానిటేషన్ ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలిస్తున్నట్లు అన్నారు.శివారు మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసే ముందు జరిగిన పనులకు సంబంధించి బిల్లులు సక్రమంగా ఉన్నాయా అనే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు.ఇదిలా ఉండగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ సర్కిల్ కార్యాలయానికి అందుబాటులో లేరని, ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని డిప్యూటీ కమిషనర్ సరస్వతి చేసిన కాల్‌కూ స్పందన రాలేదని ఏసీబీ అధికారులు వెల్లడించారు.సోదాలు పూర్తయిన తరువాత పూర్తి వివరాలు సేకరించి ఆరోపణలపై తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## మందుల సామెల్ ఇంటిపై బిజెపి నాయకుల దాడి అనైతిక చర్య

### దళిత ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

### అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య

మేడిపల్లి మార్చ్ 16(ప్రజాకలం న్యూస్)

హిందువులను కించపరిచే విధంగా మాట్లాడడని తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మందుల సామెల్ ఇంటిపై బిజెపి



నాయకులు కోడిగుడ్లు, టమోటాలతో దాడి చేయడం అనాగరిక చర్య అని,ఈ దాడిని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య తీవ్రంగా ఖండించారు. దళిత ఎమ్మెల్యే మందుల సామేల్ ఇంటిపై,ఆడవారిపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వారు మాట్లాడుతూ నిజంగా మందుల సామెల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి ఉంటే ప్రెస్ మీట్ పెట్టి ఖండించాలి,శాంతియుతంగా నిరసన తెలుపాలి అంతేకానీ ఇంటిని ముట్టడించడం, ఆడవాళ్లను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని హితవు పలికారు. మందుల సామేల్ ఇంటిపై దాడి చేసిన బిజెపి నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని నత్తి మైసయ్య డిమాండ్ చేశారు.

## జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలి

### మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన తెలంగాణా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షానూర్ బాబా

యాదాద్రి భువనగిరి , మార్చ్ 16 , ప్రజా కలం ప్రతినిధి:

యాదాద్రి భువనగిరి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇండ్ల



స్థలాల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని మునుగోడు శాననసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబావారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను ఖచ్చితంగా పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు . ఇందిరమ్మ గృహ పథకంలో జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పిస్తానని అన్నారు..

## 108 కలశాలతో కోటి తలంబ్రాల దీక్ష.




సిద్దిపేట జిల్లా మార్చి 16.ప్రజాకలం ప్రతినిధి

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో సోమవారం రామాలయం కమిటీ ఆధ్వర్యంలో కోటి తలంబ్రాల దీక్ష ఘనంగా నిర్వహించారు. భద్రాచలం సీతారాముల కళ్యాణానికి సమర్పించే గోటి తలంబ్రాలను 108 కలశాలలో నింపి హనుమాన్ దేవాలయం నుండి రామాలయం వరకు బాజా బజంత్రిలతో, కాషాయ జెండాలతో భక్తి ర్యాలీ నిర్వహించారు. అనంతరం భక్తులు రామనామ స్మరణతో గోటిని ఓలిచి తలంబ్రాలుగా మార్చి శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజుకు అందజేశారు. భద్రాచలం సీతారాముల కళ్యాణానికి తెలంగాణ నుండి నాలుగోసారి మూడు క్వింటాళ్ల గోటి తలంబ్రాలు అందిస్తున్నామని రామరాజు తెలిపారు. ఈ సందర్భంగా రామాలయం కమిటీ సభ్యులు రామకోటి రామరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.






## ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి గజ్వేల్ లో అరుదైన శస్త్రచికిత్స

### - మహిళ భుజం నుండి 750 గ్రాముల ట్యూమర్ తొలగింపు

### - ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ



మహిళా నుండి తొలగించిన 750 గ్రాముల ట్యూమర్ (నియోప్లజం)

గజ్వేల్ :16 మార్చ్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వైద్యులు మరోసారి తమ నైపుణ్యత చాటుకున్నారు. ఆర్థిక స్థోమత లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించలేని నిరుపేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందిస్తూ వారు ఆదర్శంగా నిలిచారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన జ్యోతి (32) అనే మహిళ గత కొంతకాలంగా కుడి భుజంపై పెద్ద కణితి (ట్యూమర్) సమస్యతో బాధపడుతోంది. ఆర్థిక స్తోమత లేని ఆ కుటుంబం జిల్లా ఆసుపత్రి వైద్యులను ఆశ్రయించింది. కాగా రోగి జ్యోతి పరిస్థితి గమనించిన వైద్యులు వెంటనే అవసరమైన పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించి వైద్యుల బృందం తగు ఆపరేషన్ చేసింది. దీంతో సుమారు 750 గ్రాముల బరువున్న ట్యూమర్ (నియోప్లాజశీ) విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం బాధితురాలు జ్యోతి ఆరోగ్యం నిలకడగా ఉండి కోలుకుంటున్నట్లు వైద్యులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని చెప్పారు. శరీరంలోని కణాలు అసాధారణంగా పెరగడంతో డీఎన్ఏ మార్పులు,రేడియేషన్ లేదా జన్యుపరమైన కారణాలతో ఇలాంటి ట్యూమర్లు రానున్నట్లు తెలిపారు. శరీరంలో ఎక్కడైనా అసాధారణ గడ్డలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని,క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన జనరల్ సర్జన్ డాక్టర్ ప్రేమ్ కిషోర్,అనస్థీషియా నిపుణులు డాక్టర్ మహిపాల్,డాక్టర్ ఇస్రత్,ఓటీ టెక్నీషియన్లు సునీల్, రాజ్‌కుమార్,స్టాఫ్ నర్సులు రాజు,పావని,ఆస్మాను అభినందించారు. మెరుగైన వైద్యం అందించిన వైద్య బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి

### పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.




ప్రజాకలం/జగత్గిరిగుట్ట. (ప్రతినిధి).

అమెరికా ఇజ్రాయేల్ చేస్తున్న యుద్ధలు ఆపాలని,యుద్ధం వల్ల పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని కోరుతూ నేడు రాష్ట్ర పార్టీ పిలుపు లో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో జగతగిరిగుట్ట అవుట్ పోస్ట్ వద్ద ఖాళీ గ్యాస్ సిలిండర్ లను ప్రదర్శించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాలు తన గుప్పెట్లో ఉండాలని అన్ని సంపదలన్నీ అమెరికా చేతిలో ఉండాలని భావిస్తూ ట్రంప్ చేస్తున్న యుద్దోన్మాద చర్యలను ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రజలు ఖండిస్తున్నారని ప్రపంచంలో శాంతి నెలకొల్పాలుని కోరుతూ దేశవ్యాప్తంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు నిరసనలు ప్రదర్శనలు చేస్తున్నారని అందులో భాగంగానే సిపిఐ ఆధ్వర్యంలో యుద్దోన్మాదం నశించాలి ,ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, యుద్ధం వల్ల పెరిగిన గ్యాస్ సిలిండర్ల ధరలను మరియు నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని, గ్యాస్ సరఫరా లో జరుగుతున్నటువంటి ఆలస్యాన్ని అరికట్టాలని,బుక్ చేసిన వెంటనే వచ్చేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరడం జరిగింది. కొంతమంది దీన్ని అమెరికా ఇజ్రాయిల్ మరియు ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం గా భావిస్తూ మనకి ఏమి సంబంధం లేదని మనకు ఏలాంటి నష్టం లేదని భావించి యుద్ధం వద్దన్న వాళ్లను ఇరాన్ వెళ్ళండి అన్నవాళ్లు గ్యాస్ ధర పెరిగితే యుద్ధం వల్ల పెరిగిందని సమాధానాలు ఇస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని యుద్ధము ఎక్కడ జరిగినప్పటికీ అంతిమంగా నష్టపోయేది 99% ఉన్నటువంటి పేద మధ్యతరగతి ప్రజలే కాబట్టి వెంటనే అశాంతికి కారణమైతున్నటువంటి యుద్ధాన్ని ఆపి శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేయడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఆటంకం లేదని ప్రగల్భాలు పలుకుతున్నప్పటికీ అసలు గ్యాస్ బుకింగ్ కావట్లేదని ఒకవేళ బుకింగ్ అయితే సిలిండర్ పైన 100 నుండి 200 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని కావున ప్రభుత్వంలో ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులు ప్రజలు ఎదురుకుంటున్న వాస్తవ పరిస్థితులను తెలుసుకొని మాట్లాడాలని ఏదో రాజకీయ పబ్బం గడుపుకోవడానికి అబద్ధాలు మాట్లాడితే ప్రజలు తిరగబడతారని కావున ప్రజలు ఇప్పుడు ఎదుర్కొంటున్నటువంటి తక్షణ సమస్య అయినటువంటి ధరల పెరుగుదలను అరికట్టాలని డిమాండ్ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి పార్టీ మండల సహాయ కార్యదర్శి హరినాథ్ రావు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి శ్రీనివాస్ మండల కోశాధికారి సదానంద్ శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు శాఖ సభ్యులు ఇమామ్ రవి సామెల్ కొండయ్య విజయ్ యాదగిరి లతోపాటు తదితరులు పాల్గొనడం జరిగింది.

## హాస్టళ్లలో నిర్లక్ష్యం సహించం: కలెక్టర్ హైమావతి.



సిద్దిపేట జిల్లా మార్చి 16: ప్రజాకలం ప్రతినిధి

గురుకుల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో మెనూ అమలు మరియు పరిశుభ్రతలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కే. హైమావతి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం సరైన పరిమాణంలో అందించడంతో పాటు వంటగదులు, స్టోర్ రూమ్‌లలో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. మండల స్థాయి అధికారులు ప్రతిరోజు హాస్టళ్లను సందర్శించి ఆహార నాణ్యతను పర్యవేక్షించాలని తెలిపారు.

ఇటీవల జిల్లా కేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసినప్పుడు అపరిశుభ్రత గమనించడంతో సంబంధిత సంక్షేమ అధికారిని సస్పెండ్ చేయాలని, వాచ్‌మన్ మరియు వంటమనిషిని విధుల నుంచి తొలగించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్వో నాగరాజమ్మతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.






## విశారదన్ మహారాజ్ అక్రమ అరెస్టు ను ఖండించిన జిల్లా నాయకులు

### - ధర్నా కు పిలుపునిచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ-జేఏసీ జిల్లా నాయకులు మహిపాల్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి)మార్చ్ 16:


వెలుగుమట్ల భూబాధితుల న్యాయం ఖమ్మం జిల్లా కలెక్టర్ ని కలవడం కోసం ఖమ్మం వెళ్తున్న విశారదన్ మహారాజ్ ని అక్రమంగా అరెస్టును ఖండిస్తు సోమవారం ఆర్మూర్ పట్టణ కేంద్రంలో డీఎస్పీ మరియు బీసీ,ఎస్సీ,ఎస్టీ- జేఏసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా ఆందోళన చెప్పట్టడం జరిగింది. విశారదన్ మహారాజ్ ని వెంటనే విడుదల చేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతాం అని అలాగే రాష్ట్ర బంద్ కూడా పిలుపునివ్వడానికి సిద్ధం అని మహిపాల్ మహారాజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర నాయకులు ప్రేమ్ అలాగే జిల్లా నాయకులు సుభాష్,రమేష్, ఉమేష్ ,మురళి,భుమేష్,కిషన్, భాస్కర్ ,నితిన్, కార్యకర్తలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

### -కలెక్టర్ ఇలా త్రిపాఠి సమయపాలన పాటించాలని అధికారులకు ఆదేశం.

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మార్చ్ 16:

ప్రజా సమస్యల సత్వర పరిష్కారాల కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి





అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్లు వికాస్ మహాతో , అభిజ్ఞాన్ మాల్వియా ఇన్చార్జి అదన కలెక్టర్ దిలీప్ కుమార్ డిఆర్డిఓ సాయి గౌడ్,ఆర్డిఓ రాజేంద్రకుమార్ బోధన్ ఏ.సి.పి శ్రీనివాస్ లతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాటి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 80 విన్నతులను అందగా వాటి పరిష్కారాల కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. ఇదిలా ఉండగా, ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు కొంత ఆలస్యంగా హాజరు కావడాన్ని గమనించిన కలెక్టర్ ప్రతి ఒక్కరు విధిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమాలు ప్రారంభమయ్యే నిర్మిత సమయం ఉదయం 10:30 గంటల వరకు అధికారులు అందరు హాజరై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వ్యక్తికి 4 రోజుల జైలు శిక్ష

నిజామాబాద్(ప్రజా కలం ప్రతినిధి)మార్చ్ 16:

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తి పట్టుబడగా కోర్టు అతనికి జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళ్తే




జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం రాఘవపేట గ్రామ వాసి ఎట్టం మల్లేష్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కాడు. కమ్మర్ పల్లి మండ లంలో ఎస్సై జి.అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మల్లేష్ మద్యం సేవించిన స్థితిలో వాహనం నడుపుతూ పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి నేడు ఆర్మూర్ న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. కోర్టులో నిందితుడిపై మోపిన అభియోగాలు రుజువు కావడంతో న్యాయమూర్తి మల్లేష్‌కు నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. తీర్పు అనంతరం పోలీసులు అతనిని రిమాండ్ నిమిత్తం జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ రెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలుగుతుందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

# మెడికవర్ హాస్పిటల్ సికింద్రాబాద్‌లో ఓబిసిటీ క్లినిక్ ప్రారంభం

## హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన చేతుల మీదుగా ప్రారంభోత్సవం




**హైదరాబాద్, మార్చి 16 (ప్రజా కలం ప్రతినిధి)**

ఊబకాయం (Obesity) కారణంగా పెరుగుతున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని, మెడికవర్ హాస్పిటల్ సికింద్రాబాద్‌లో ప్రత్యేక ఓబిసిటీ క్లినిక్‌ను ప్రారంభించింది. ఈ క్లినిక్‌ను హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత జీవనశైలిలో ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఊబకాయం వేగంగా పెరుగుతోందని, దీని వల్ల మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వంటి అనేక సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ప్రజలు ప్రారంభ దశలోనే వైద్యుల సలహా తీసుకుని జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా ఊబకాయాన్ని నియంత్రించవచ్చని సూచించారు. కొత్తగా ప్రారంభించిన ఈ ఓబిసిటీ క్లినిక్‌లో BMI అంచనా, పోషకాహార సలహాలు, హార్మోన్ పరీక్షలు, వ్యాయామ మార్గదర్శకాలు, అవసరమైతే బారియాట్రిక్ సర్జరీ వంటి సమగ్ర సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. డా. పవన్ అడ్డాల, చీఫ్ కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ & ప్రోగ్రామ్ హెడ్ -- లివర్ అండ్ ప్యాంక్రియాస్ ట్రాన్స్‌ప్లాంట్ మాట్లాడుతూ, ఊబకాయం కేవలం శరీర బరువు పెరగడం మాత్రమే కాదు ఇది ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత వ్యాధులు, జీర్ణకోశ సమస్యలకు కూడా కారణమవుతుంది. సరైన వైద్య పర్యవేక్షణతో పాటు అవసరమైనప్పుడు బారియాట్రిక్ సర్జరీ ద్వారా దీర్ఘకాలిక పరిష్కారం అందించవచ్చు అన్నారు.

డా. మాధవి వెర్పుల, సీనియర్ కన్సల్టెంట్ ఎండోక్రినాలజిస్ట్ మాట్లాడుతూ, ఊబకాయం శరీరంలోని హార్మోన్ల సమతుల్యతను ప్రభావితం చేసి టైప్-2 డయాబెటిస్, థైరాయిడ్ సమస్యలు, స్లీప్ అప్నియా వంటి అనేక సమస్యలకు దారితీస్తుంది. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా ఆహారం, వ్యాయామం, మెడికల్ మేనేజ్‌మెంట్ ద్వారా దీన్ని నియంత్రించవచ్చని తెలిపారు.

ఊబకాయం కేవలం శరీర బరువు పెరగడం మాత్రమే కాకుండా, శరీరంలోని అనేక అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుందని వైద్యులు వివరించారు.

ముఖ్యంగా టైప్-2 డయాబెటిస్, హై బ్లడ్ ప్రెషర్, స్లీప్ అప్నియా, ఫ్యాటీ లివర్, కీళ్ల నొప్పులు, హార్మోనల్ సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలకు ఇది కారణమవుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు డా. కృష్ణ గోపాల్ భండారి, డా. సంతోష్ ఎం. నారాయణకర్, డా. అజయ్ శేషేరావ్ షిండే, DMHO డా. వెంకటి, రీజనల్ డైరెక్టర్ డా. జానకి రామ్, సెంటర్ హెడ్ కృష్ణవేణి, మెడికల్ సూపరింటెండెంట్ డా. ప్రశాంత్, ఆసుపత్రి వైద్యులు మరియు పలువురు ఆరోగ్య నిపుణులు పాల్గొన్నారు.




### అధిక బరువుకు అనేక కారణాలు

**ఒత్తిడి,హార్మోన్స్,సమతుల ఆహార లోపం, నిద్రలేమి**
**-కలెక్టర్ హరి చందన**






## వెల్లుట్ల లో బెల్ట్ షాప్ లను మూసి వేయాలి

ఎల్లారెడ్డి మార్చ్ 16 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మండలం లోని వెల్లుట్ల గ్రామంలో ఉన్న బెల్టు షాపులను మూసివేయాలని సోమవారం ఆ గ్రామ ప్రజలు ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో బెల్ట్ షాపులలో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు చేయటం వల్ల నిత్యం గొడవలు అవుతున్నాయిని, యువత పెడదారి పడుతున్నారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వారిపై చట్టరీత్య చర్యలు తీసుకొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్లుట్ల గ్రామస్థులు లింగపురం సాయిలు, జక్కుల సంతోష్ కుమార్, పోతుగంటి సాయిలు, కన్నెబొయిన రాజు, బెగరి రవి, కృష్ణ, గౌతమ్, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




## వెల్ నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో...


### - మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం

ఎల్లారెడ్డి మార్చ్ 16 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మున్సిపల్ పాలకవర్గ సభ్యులను సోమవారం వెల్ నెస్ హాస్పిటల్ నిజామాబాద్ యాజమాన్యం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెల్ నెస్ హాస్పిటల్ ప్రజలకు చేస్తున్న సేవలను, ఎల్లారెడ్డి ప్రాంతంలో ఎక్కడ నిరుపేదలు ఉన్న తమ వంతు వైద్య పరమైన సహాయ సహకారాలు అందిస్తామని చైర్మన్ పద్మ శ్రీకాంత్, పాలకవర్గానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చంద్రయ్య, గఫార్, సిద్ది శ్రీధర్, గాదే తిరుపతి, కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, తమ్మల శ్యామ్. వెల్నెస్ హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ గాదె రవికుమార్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి...

### - డిటికి వినతి పత్రం అందజేసిన బిజెపి నేతలు

ఎల్లారెడ్డి మార్చు 16 ప్రజా కలం ప్రతినిధి : గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బిజెపి నాయకులు డిప్యూటీ తహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ,



రైతు భరోసా, కౌలు రైతులకు రైతు భరోసా, పెళ్లి కానుక తులం బంగారం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాసం, వృద్ధులకు, వికలాంగులకు పెంచిన పెన్షన్లు, అర్హులైన నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు మర్రి బాలకిషన్, పట్టణ అధ్యక్షులు రాజేష్, మండలాధ్యక్షుడు నర్సింలు, జనరల్ సెక్రెటరీ కుశలకంటి శంకర్, ఉపాధ్యక్షులు వంగపల్లి కాశీనాథ్, పులి రమేష్, మాజీ పట్టణ అధ్యక్షులు సతీష్, సీనియర్ నాయకులు సత్యం, యువ నాయకులు ఒలేపు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపికి రాజీనామా చేసిన మాజీ ఎంపీపీ నక్క గంగాధర్...

ఎల్లారెడ్డి మార్చ్ 16 ప్రజా కలం ప్రతినిధి : భారతీయ జనతా పార్టీకి ఎల్లారెడ్డి మాజీ ఎంపీపీ, ఆ పార్టీ సీనియర్ నేత నక్క గంగాధర్ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధికి ఇప్పటి వరకు క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పని చేశానని, ఈ క్రమంలో తాను ఎవరినైనా నొప్పించి ఉ ంటే క్షమించాలని అన్నారు. తనకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించాలని జిల్లా పార్టీ నాయకులను ఆయన కోరారు.



## తప్పిపోయిన వ్యక్తి పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య



ఎల్లారెడ్డి మార్చ్ 16 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన చిట్యాల దుర్గేందర్ అనే వ్యక్తి గత రెండు రోజుల క్రితం తప్పిపోయిన విషయం తెలిసింది. సోమవారం స్థానిక పెద్ద చెరువులో దుర్గేందర్ శవమై తేలాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ మహేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దుర్గేందర్ మిస్సింగ్ పై అతడి అన్న పరంధాములు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభించామన్నారు. దర్యాప్తులో భాగంగా సోమవారం ఉదయం ఎల్లారెడ్డి పెద్ద చెరువులో ఒక మృతదేహం ఉన్నట్లు సమాచారం అందిందని, పోలీసులు అక్కడికి చేరుకుని శవాన్ని పరిశీలించగా అది దుర్గేందర్ మృతదేహంగా గుర్తించామన్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. మృతుడికి మానసిక పరిస్థితి సరిగా లేక అప్పుడప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి వచ్చేవాడని ఆయన తెలిపారు. శనివారం రాత్రి హైదరాబాద్ నుండి కామారెడ్డి మీదుగా లింగారెడ్డిపేట గ్రామానికి బయలుదేరి ఎల్లారెడ్డి అంబేద్కర్ చౌక్ వద్ద బస్సు దిగి, పెద్దచెరువు వైపు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడి అయిందన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి సెమినార్...

### - రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ల రాక

ఎల్లారెడ్డి మార్చ్ 16 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం "కెమికల్, లైఫ్ సైన్సెస్‌లో వస్తున్న మార్పులు - సవాళ్లు" అనే అంశంపై ఒక రోజు జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించ నున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఇ. లక్ష్మీనారాయణ, సెమినార్ కన్వీనర్ డా. బి. అరుణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు వారు సోమవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సెమినార్ కు ?ముఖ్య అతిథులుగా రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ ఎ. దేవసేన, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. యాదగిరి లు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. రసాయన, జీవశాస్త్ర రంగాలలో వస్తున్న అత్యాధునిక మార్పులపై విద్యార్థులకు,పరిశోధకులకు అవగాహన కల్పించడమే ఈ సెమినార్ ముఖ్య ఉద్దేశమన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి సుమారు 30 మందికి పైగా పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను ఈ సదస్సులో సమర్పించను న్నారని వారు తెలిపారు. ఈ సెమినార్ ద్వారా విద్యార్థులకు సబ్జెక్టుపై లోతైన అవగాహన పెంచుకోవడమే కాకుండా, జాతీయ స్థాయి శాస్త్రవేత్తలతో నేరుగా చర్చించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాటనీ విభాగం అధ్యాపకురాలు డా. ఎస్. గోదావరి, అధ్యాపక బృందం పాల్గొంటారని, విద్యార్థులు, పరిశోధకులు అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



## బౌద్ధ బిక్షవుపై కేసులు ఎత్తివేసి, న్యాయ డిమాండ్లు నెరవేర్చాలి




నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మార్చ్ 16:

పాలి భాష సవర్ధన సమన్వయ సమితి, కుల నిర్మూలన సంఘర్షణ సమితిల ఆధ్వర్యంలో బంతే విమాన్సా పై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం ముంబై ఆజాద్ మైదానంలో నిరసన తెల్పారు. వక్తలు మాట్లాడుతూ ముంబై యూనివర్సిటీ (ఎం.యూ)కి చెందిన పి.ఎచ్.డి రిసర్చ్ విద్యార్థి విమాన్సా ఎం.యూ లో 300మందికి హాస్టల్ ఏర్పాటు, ప్రత్యేక పాలి భాష భవనం, దానికి తగిన ఫండ్ కేటాయించాలని రాతపూర్వకంగా విజ్ఞప్తులు అనేకం చేశారు. డిపార్ట్మెంట్ స్పందించక పోవడం వల్ల ఎం.యూ గెట్ వద్ద సత్యాగ్రహ ఆందోళనకు దిగారు. ఫిబ్రవరిలో కేంద్రమంత్రి కిరణ్ రిజ్జు యూనివర్సిటీకి వచ్చిన సందర్భంగా అట్టి అంశాలపై నివేదిక ఇవ్వడానికి బంతేజీ వెళ్ళినప్పుడు రక్షక గార్డ్స్ వచ్చి అయన పై దాడులు చేశారు. పైగా బంతేజీ పైనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు. పి.ఎచ్.డి రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేశారు. ఐతే బంతేజీ పై విధించిన కేసుల్ని వెనక్కి తీసుకోవాలి, ఎం.యూ ఛాన్సలర్ రవీంద్ర కులకర్ణిని తక్షణమే సస్పెండ్ చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నిరసనలో గాయకులు సందేశ్ గైక్వాడ్, సుశీల గాంగుర్డే, బంతే పూర్ణ, డాక్టర్ సంఘమిత్ర, సుధ మోహిలే, కామ్రేడ్ శుభోద్ మోరే, కామ్రేడ్ శైలెంద్ర కాంబ్లే, ఇంద్రజీత్ మోహితే, సూరజ్ మౌర్య, సంతోష్ సాతే, ప్రదీప్ అడంగ్లే, డాక్టర్ దీపక్ గోడేశ్వర్, అదిథి పవార్, సంజయ్ సిర్సాట్, వ్యాఖ్యతగా వైభవ్ సోనావ్నే వహించారు.





ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైన నేపథ్యంలో గ్రామ పంచాయతీలలో ప్రస్తుతం నెలకొన్న తాజా పరిస్థితులపై ప్రజా కలం దినపత్రిక ప్రత్యేక కథనం

మాజీ సర్పంచ్ లు ... తాజా సర్పంచ్ లు... మధ్యలో పంచాయతీ కార్యదర్శులు...

# జిపిల్లో మొదలైన 'పెండింగ్ బిల్లుల పంచాయతీ'

- విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు తమకే చెల్లించాలని మాజీ సర్పంచ్ల పట్టు
- తాము చేస్తున్న అభివృద్ధి పనులకి వాడుకుంటామంటున్న తాజా సర్పంచ్లు
- ప్రత్యేక అధికారుల పాలనలో తాము పెట్టిన బిల్లులను చెల్లించాలంటున్న పంచాయతీ కార్యదర్శులు...
- ప్రభుత్వ ఆదేశాలను మాత్రమే పాటిస్తామంటున్న అధికారులు




**ఎల్లారెడ్డి మార్చ్ 16 ప్రజా కలం ప్రతినిధి :** రెండేళ్ల సుదీర్ఘకాలం తర్వాత విడుదలైన 15 వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలలో కొత్త చిచ్చును రేపాయి. ఇటీవల విడుదలైన ఈ నిధులను తమ పెండింగ్ బిల్లులకే కేటాయించాలని మాజీ సర్పంచ్లు కోరుతుండగా, ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులకు వాడుకుంటామని తాజా సర్పంచ్ లు పట్టు పడుతున్నారు. వీరి ఇరువురి మధ్యలో ప్రత్యేక అధికారుల పాలనలో తాము పెట్టిన ఖర్చులను బిల్లుల రూపంలో చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులు సైతం డిమాండ్ చేస్తున్నారు. దీంతో వచ్చిన 15 వ ఆర్థిక సంఘం నిధులను ఎవరికి చెల్లిస్తారో చూడాలి. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను మాత్రమే తాము పాటిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**మాజీ సర్పంచ్లకు చెల్లించాల్సి ఉన్న పెండింగ్ బిల్లులు...**

గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలో అప్పటి సర్పంచులు అభివృద్ధి పనుల నిమిత్తం లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి మరీ పనులు చేశారు. అయితే ఆ బిల్లులు మంజూరు కాకముందే ప్రభుత్వం మారిపోయింది. దీనికి తోడు పంచాయతీ పాలకవర్గాల గడువు సైతం ముగిసింది. మాజీ సర్పంచులు తాము అభివృద్ధి పనుల నిమిత్తం చేపట్టిన పెండింగ్ బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలో ఒక్కో సర్పంచ్కు సుమారు 10 నుంచి 20 లక్షల వరకు పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులలో తమకే ముందుగా ప్రాధాన్యమిచ్చి పెండింగ్ బిల్లులను చెల్లించాలని మాజీ సర్పంచ్లు వేడుకుంటున్నారు. ఇప్పటికే తాము తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆస్తులు అమ్ముకుంటున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఆలస్యం చేస్తే తమకు ఆత్మహత్యలు తప్ప మరో మార్గం లేదని వారు దుఃఖంతో తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు.

**పంచాయతీ కార్యదర్శులకు సైతం చెల్లించాల్సిన బిల్లులు ఎన్నో....**

గత 2024 సంవత్సరం ఫిబ్రవరిలో అప్పటి పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. తర్వాత జిపి లకు రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఎన్నికలు నిర్వహించలేదు. నూతన పాలకవర్గాలు పంచాయతీల లో కొలువు దీరకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిధులు విడుదల కాలేదు. అప్పటి నుండి పంచాయతీల నిర్వహణ బాధ్యతను పూర్తిగా కార్యదర్శులే చూశారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు బాధ్యతలు నిర్వహించి నప్పటికీ ఆర్థికంగా మాత్రం వారు ఎలాంటి ఖర్చులు చేయలేదని తెలుస్తోంది. దీంతో చెత్త సేకరణ కోసం ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్ పౌడర్, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, వీధి దీపాల నిర్వహణ వంటి ఎన్నో పనులను పంచాయతీ కార్యదర్శులు సొంత డబ్బులు పెట్టి నిర్వహించారు. పంచాయతీల నిర్వహణతో పాటు సర్పంచ్ ఎన్నికల వరకు తామే అన్ని ఖర్చులు పెట్టామని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. ప్రస్తుతం ఒక్కో పంచాయతీ కార్యదర్శి లక్ష రూపాయలు మొదలుకొని 5 లక్షల రూపాయల వరకు బిల్లులు రావాల్సి ఉందని వారు అంటున్నారు. తాము సైతం మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వారమేనని అప్పులు తెచ్చి మరీ పంచాయతీలను నిర్వహించామని, తమకే ముందుగా 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి తాము పెట్టిన ఖర్చుల బిల్లులు చెల్లించాలని వారు వేడుకుంటున్నారు.

**నిధులు వచ్చిన ఎవరికి చెల్లించాలో తెలియక తికమక...**

మొన్నటి వరకు నిధులు లేక ఇబ్బంది పడ్డ గ్రామ పంచాయతీలు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15 వ ఆర్థిక సంఘం నిధుల ను ఎవరికి చెల్లించాలో తెలియక సంబంధిత శాఖల అధికారులు తికమక పడుతున్నారు. అయితే విడుదలైన నిధులలో 10 లక్షల లోపు ఉన్న పెండింగ్ బిల్లులను మాజీ సర్పంచ్లకు చెల్లించాలని రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ కమిషనర్ ఆదేశించినట్లు మాజీలు చెబుతున్నారు. మరోవైపు ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీ కార్యదర్శులు పెట్టిన ఖర్చులను మాత్రమే చెల్లించాలని ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. విడుదలైన కొద్దిపాటి నిధులను ఎవరికి చెల్లించాలో తెలియక పోవడంతో పాటు ప్రస్తుత తాజా సర్పంచ్లకు ఏం చేయాలో పాలు పోవడం లేదు. గ్రామాల్లో ప్రస్తుతం చేపడుతున్న అత్యవసర అభివృద్ధి పనులకే తాము 15 ఆర్థిక సంఘం నిధులను వాడుకుంటామని వారు స్పష్టం చేస్తున్నారు.

**తిరిగి గెలిచిన మాజీ లకు మాత్రం నో టెన్షన్....**

అయితే గతంలో సర్పంచ్ గా పనిచేసి ఇటీవల జరిగిన ఎన్నికల్లో తిరిగి గెలిచిన సర్పంచ్లకు మాత్రం 15 ఆర్థిక సంఘం నిధుల చెల్లింపు విషయంలో ఎలాంటి గందరగోళం లేదు.

గతంలో భర్త ఉండి ప్రస్తుతం సర్పంచ్ గా భార్య గెలిచిన కూడా అప్పుడు తాము పెట్టిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను ఈ నిధులలో నుండి తీసుకునే వెసులుబాటు వారికి ఉంది. ఎందుకంటే సర్పంచ్ గా అధికారం తమ చేతుల్లోనే ఉండడంతో ఎలాంటి గందరగోళం లేదు. కానీ గతంలో సర్పంచ్ గా పనిచేసి ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన, రిజర్వేషన్లు అనుకూలించక పోటీ చేయకుండా దూరంగా ఉన్న వారి గ్రామాల్లో మాత్రమే పెండింగ్ బిల్లుల చెల్లింపు సమస్య ప్రారంభమైంది. అటు మాజీ సర్పంచ్ లు ఇటు తాజా సర్పంచ్ లు మధ్యలో పంచాయతీ కార్యదర్శులు అన్నట్లుగా పరిస్థితి తయారయింది. మరి ఈ ముగ్గురిలో ఎవరికి పెండింగ్ బిల్లులు చెల్లిస్తారో వేచి చూడాలి..

# తెలంగాణ బీజేపీ రాష్ట్ర ప్రతినిధిగా బి. ఇంద్రసేన్ రెడ్డి

- పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్న ప్రముఖ వ్యాపారవేత్త ఇంద్రసేన్ రెడ్డి
- బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్, మార్చి 16 (ప్రజా కలం ప్రతినిధి)** ప్రముఖ వ్యాపారవేత్త, పెట్టుబడిదారుడు బి. ఇంద్రసేన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రతినిధిగా నియమితులయ్యారు.

టెక్నాలజీ, సోలార్ ఎనర్జీ మరియు రియల్ ఎస్టేట్ రంగాల్లో దాదాపు మూడు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయనకు పార్టీ కీలక బాధ్యతలను అప్పగించింది. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కి ఇంద్రసేన్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాయితీ, సమానత్వ భావంతో తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. లఘు ఉద్యోగ్ భారతి, భారత్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ఫోరమ్ వంటి సంస్థల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయన, తన అనుభవంతో 'వికసిత భారత్' లక్ష్య సాధనలో భాగస్వామ్యం అవుతానని పేర్కొన్నారు. ఇంద్రసేన్ రెడ్డి నియామకం పట్ల పలువురు పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.






# కామారెడ్డి మున్సిపల్ లో ఏసీబీ సోదాలు....

**ఎల్లారెడ్డి (కామారెడ్డి) మార్చి 16 ప్రజా కలం ప్రతినిధి :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో వచ్చిన అవినీతి ఆరోపణలపై ఆరా తీస్తున్నారు. కమిషనర్ ఛాంబర్ లో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. ఈ తనిఖీలతో ఆయా శాఖల అధికారుల్లో గుబులు మొదలైంది.

- 2025-26లో అనధికార నిర్మాణాలపై 47 ఫిర్యాదులు వచ్చినా, నోటీసులు ఇచ్చిన తర్వాత ఎటువంటి చర్య తీసుకోలేదు.
- 400కి పైగా వాణిజ్య షాపుల ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్స్ పెండింగ్‌లో ఉండి, సుమారు ?1 కోటి బకాయిలు ఏర్పడ్డాయి.
- ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్లలో తేడాలు గుర్తించారు, దీనివల్ల ప్రభుత్వానికి నష్టం.
- మున్సిపల్ అధికారుల ఫ్యుయెల్ ఛార్జీల కోసం నెలకు ?12,40,000 కేటాయించినా, సరైన రికార్డులు లేవు.
- కొంతమంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను గైర్హాజరుగా మార్క్ చేసినా, పూర్తి నెల జీతం చెల్లించారు.
- డిసెంబర్ 2025 నుంచి 169 బిల్డింగ్ పర్మిషన్ దరఖాస్తుల్లో 18 ఆలస్యంగా ప్రాసెస్ అయ్యాయి.


తాము కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఏసీబీ సోదాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించి చర్యలు తీసుకోవాలని సిఫారసు చేస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ అయితే టోల్ ఫ్రీ నెంబర్ 1064కి కాల్ చేయాలని వారు సూచించారు.



# ఉరవకొండలో అక్రమ ట్యూషన్లపై చర్యలు తీసుకోవాలి

## MROకు ఏఐఎఫ్డిఎస్ విద్యార్థి సంఘం వినతిపత్రం

**ఉరవకొండ, మార్చి 16 (ప్రజా కలం ప్రతినిధి)** ఉరవకొండ పట్టణంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు మరియు కొన్ని ప్రైవేట్ ట్యూషన్ సెంటర్లు విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తూ అక్రమంగా ట్యూషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ ఏఐఎఫ్డిఎస్ విద్యార్థి సంఘం స్థానిక ఎంఆర్వోకు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీఎం సిద్దు, జిల్లా అధ్యక్షుడు నందు, జిల్లా నాయకులు మాట్లాడుతూ పట్టణంలో కొందరు ట్యూటర్లు తల్లిదండ్రులను మోసం చేస్తూ నవోదయ, కోరుకొండ సైనిక్ స్కూల్, గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామని నమ్మబలికి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు ఇటువంటి అక్రమాలను అరికట్టడంలో విఫలమయ్యారని వారు విమర్శించారు. ఏపీ విద్యా చట్టం--1982 మరియు విద్య హక్కు చట్టాన్ని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు, ట్యూషన్ నిర్వాహకులు బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. విద్య హక్కు చట్టం సెక్షన్ 19 ప్రకారం పాఠశాలలు ప్రభుత్వ గుర్తింపు పొందాల్సి ఉంటుందని, అలాగే సెక్షన్ 23 ప్రకారం అర్హత కలిగిన ఉపాధ్యాయులచే మాత్రమే బోధన జరగాలని పేర్కొన్నారు. అయితే కొన్ని ట్యూషన్ సెంటర్లలో అర్హత లేని వ్యక్తులచే బోధన కొనసాగుతున్నట్లు ఆరోపించారు. పట్టణంలోని మార్కండేయ స్వామి దేవస్థానం సమీపంలో ప్రతిభ స్టడీ సర్కిల్ పేరిట ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా ట్యూషన్ నిర్వహిస్తున్నారని, అక్కడ అర్హత లేని వ్యక్తులతో విద్యార్థులకు బోధన సాగిస్తున్నారని తెలిపారు. ఇక ప్రభుత్వ ఉపాధ్యాయులే స్పందన ట్యూషన్, సువిద్య ట్యూషన్ వంటి పేర్లతో ట్యూషన్లు నిర్వహిస్తూ వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల నుంచి టీసీలు తీసుకొని, దూర ప్రాంతాల్లోని పాఠశాలల్లో చేర్పించినట్లు రికార్డులు సృష్టించి ట్యూషన్ ముసుగులో రెగ్యులర్ తరగతులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఏపీ విద్యా చట్టం--1982 సెక్షన్ 32 ప్రకారం రిజిస్ట్రేషన్ లేకుండా ట్యూషన్లు నిర్వహిస్తే మొదటి తప్పిదానికి రూ.10 వేల జరిమానా, రెండోసారి లక్ష రూపాయల జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయని గుర్తు చేశారు. విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తూ అక్రమంగా ట్యూషన్లు నిర్వహిస్తున్న నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని ఏఐఎఫ్డిఎస్ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com